# ప్రజా మారుతి
తెలంగాణ జాతీయ దినపత్రిక
ఎడిటర్ : సిహెచ్.వి. ప్రభాకర్ రావు




తిరుమల శ్రీవారిని దర్శించుకున్న తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి

ప్రచురణ : జగిత్యాల సంపుటి : 05 సంచిక : 179 పేజీలు : 04 వెల రూ. 2 బుధవారం 31 - 12 - 2025

## సంక్రాంతి ముంగిట హైవేపై ట్రాఫిక్ కష్టాలు ఉండకూడదు

- రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి ఆదేశాలు
- హైదరాబాద్ – విజయవాడ హైవేపై ట్రాఫిక్ కష్టాలు ఉండకూడదు
- హైవేలపై సంక్రాంతి ట్రాఫిక్ నివారణకు ఉన్నతాధికారులతో మంత్రి కోమటిరెడ్డి సమీక్ష
- జనవరి 8 నుంచి హైదరాబాద్ – విజయవాడ మార్గంలో భారీ రద్దీ అంచనా
- పండుగ వేళ హైవే లేన్‌లు మూసివేసే పనులు నిలిపివేయాలని ఆదేశం
- కీలక జంక్షన్లలో భారీగా ట్రాఫిక్ పోలీసుల మోహరింపు
- ప్రయాణికుల భద్రతే లక్ష్యంగా హై విజిబిలిటీ బోర్డుల ఏర్పాటు



తెలుగు రాష్ట్రాల ప్రజలకు అతిపెద్ద పండుగైన సంక్రాంతి సమీపిస్తున్న వేళ, ప్రయాణికులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా తెలంగాణ ప్రభుత్వం ముందస్తు చర్యలు చేపట్టింది. ముఖ్యంగా పండుగ సమయంలో అత్యంత రద్దీగా ఉండే హైదరాబాద్ – విజయవాడ జాతీయ రహదారిపై ట్రాఫిక్ నియంత్రణకు తీసుకోవాల్సిన చర్యలపై రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి ఉన్నతాధికారులతో ప్రత్యేక సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, జనవరి 8వ తేదీ నుంచే హైవేలపై వాహన రద్దీ గణనీయంగా పెరిగే అవకాశముందని అంచనా వేశారు. ఈ నేపథ్యంలో ప్రయాణికులు సురక్షితంగా, సజావుగా తమ గమ్యస్థానాలకు చేరుకునేలా పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. రద్దీ ఎక్కువగా ఉండే రోజుల్లో హైవేలపై మరమ్మతులు లేదా ఇతర కారణాలతో లేన్‌లను మూసివేసే పనులను పూర్తిగా నిలిపివేయాలని సూచించారు. వాహనాల

- మిగతా 2 లో

## అసెంబ్లీ, మండలిలో బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ల నియమకం




- డిప్యూటీ ఫ్లోర్ లీడర్లను నియమించిన కేసీఆర్
- అసెంబ్లీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్లుగా హరీష్ రావు, సబిత, తలసాని
- శాసనమండలి ఉపనేతలుగా ఎల్. రమణ, పోచంపల్లి శ్రీనివాస్ రెడ్డి మండలి విప్‌గా దేశపతి శ్రీనివాస్‌కు బాధ్యతలుఅసెంబ్లీ శీతాకాల సమావేశాల వేళ కేసీఆర్ కీలక నిర్ణయం

## త్వరలో పోలీస్ ఉద్యోగాల నియామకాల కోసం కసరత్తు!




- త్వరలో పోలీస్ నియామకాలు!
- డీజీపీ శివధర్‌రెడ్డి
- రాష్ట్ర పోలీస్ వార్షిక నివేదిక విడుదల చేసిన డీజీపీ శివధర్‌రెడ్డి
- త్వరలో పోలీస్ ఉద్యోగాల నియామకాల కోసం కసరత్తు
- 2.33 శాతం క్రైమ్ రేట్ తగ్గిందని వెల్లడి
- రాష్ట్ర పోలీస్ వార్షిక నివేదిక విడుదల చేసిన డీజీపీ శివధర్‌రెడ్డి తెలంగాణలో శాంతి భద్రతలు పూర్తిగా అదుపులో ఉన్నాయని తెలిపారు
- తెలంగాణ గ్రామ పంచాయతీ ఎన్నికలను ప్రశాంతంగా నిర్వహించమని గుర్తు చేశారు

## ఘనంగా వైకుంఠ ఏకాదశి వేడుకలు

- తరలివచ్చిన భక్త సందోహం
- ముక్కోటి ఏకాదశి సందర్భంగా ఏపీలో భక్తులతో కిటకిటలాడిన ఆలయాలు
- ప్రత్యేక పూజలు, అభిషేకాలు, ఉత్తర ద్వార దర్శనాలతో మార్మోగిన ప్రముఖ దేవస్థానాలు
- భక్తులతో కిటకిటలాడిన దేవాలయాలు
- ఘనంగా వైకుంఠ ఏకాదశి వేడుకలు రాష్ట్రవ్యాప్తంగా జరిగాయి
- తెల్లవారుజాము నుంచే వైష్ణవాలయాలకు భారీగా భక్తులు




ధనుర్మాసంలో వచ్చే వైకుంఠ ఏకాదశికి ప్రత్యేక విశిష్టత వుందనీ, విష్ణుమూర్తి వైకుంఠ ద్వారాలు తెరుస్తారనీ, ఆయనను దర్శించుకుంటే మోక్షం లభిస్తుందని భక్తుల నమ్మకం, స్వర్గద్వార ఏకాదశి అని కూడా పిలిచే ఈ రోజునే మహావిష్ణువు గరుడ వాహనంపై మూడు కోట్ల దేవతలతో భూలోకానికి వచ్చి భక్తులకు దర్శనమిస్తారని పురాణాలు చెబుతున్నాయి.వైకుంఠ ఏకాదశి వేడుకలు రాష్ట్రవ్యాప్తంగా ఘనంగా జరిగాయి. తెల్లవారుజాము నుంచే వైష్ణవాలయాలకు భక్తులు భారీగా తరలివచ్చారు. ముక్కోటి ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకొని నందిగామలోని శ్రీ రామలింగేశ్వర స్వామి దేవాలయం, తిరువూరు శ్రీ కోదండ రామాలయం, జగ్గయ్యపేటలోని దేవాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. పెనుగంచిప్రోలులోని శ్రీ తిరుపతమ్మ అమ్మవారి దేవాలయంలో ఉత్తరద్వార దర్శనానికి జనం పోటెత్తారు. భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు.ముక్కోటి ఏకాదశిని పురస్కరించుకుని పట్టణాలు, ల

- మిగతా 2 లో

## దేశంలో భారీగా తగ్గిన ఏటీఎంల సంఖ్య




- ఒక్క కారణంతో వేలాదిగా మూసివేత
- డిజిటల్ చెల్లింపుల పెరుగుదలే ప్రధాన కారణం
- ప్రభుత్వ బ్యాంకుల కంటే ప్రైవేట్ ఏటీఎంలలోనే ఎక్కువ కోత
- ఏటీఎంలు తగ్గినా కొత్తగా పెరిగిన బ్యాంక్ బ్రాంచులు

## 2026 జనవరి 1 నుంచి అమలు కానున్న ఆర్థిక మార్పులు!



- జనవరి 1 నుంచి అమల్లోకి రానున్న 8వ వేతన సంఘం
- పాన్-ఆధార్ లింక్ చేయకపోతే నిలిచిపోనున్న సేవలు
- వారానికి ఒకసారి క్రెడిట్ స్కోర్ అప్డేట్ చేసేలా నిబంధనలు
- పీఎం కిసాన్ కొత్త లబ్ధిదారులకు ఫార్మర్ ఐడీ తప్పనిసరి
- గ్యాస్ ధరలు, ఐటీ రిటర్నుల విధానంలోనూ మార్పులు

మరో రెండు రోజుల్లో 2025 సంవత్సరం ముగిసి, 2026 కొత్త సంవత్సరం ప్రారంభం కాబోతోంది. జనవరి 1 నుంచి సామాన్యుడి జేబుపై, ప్రభుత్వ ఉద్యోగుల వేతనాలపై, రైతుల సంక్షేమ పథకాలపై ప్రభావం చూపే అనేక కీలక మార్పులు చోటుచేసుకోనున్నాయి. బ్యాంకింగ్, పన్ను విధానాలు, గ్యాస్ ధరలు వంటి అంశాల్లో వస్తున్న ఈ మార్పులను ప్రజలు గమనించాల్సి ఉంది. - మిగతా 2 లో

## ఇచ్చిన మాట నిలబెట్టుకున్న డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్

- శంకరగుప్తం మేజర్ డ్రెయిన్ ఆధునికీకరణ పనులకు పవన్ కల్యాణ్ శంకుస్థాపన
- రూ. 20.77 కోట్ల అంచనా వ్యయంతో శంకరగుప్తం డ్రెయిన్ పనులకు శంకుస్థాపన
- క్యాంపు కార్యాలయం నుంచి వర్చువల్‌గా పాల్గొన్న డిప్యూటీ సీఎం



కోనసీమ జిల్లా అభివృద్ధి కార్యక్రమాల్లో మరో కీలక అడుగు పడింది. జిల్లా పరిధిలోని శంకరగుప్తం మేజర్ డ్రెయిన్ ఆధునికీకరణ పనులకు డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో ఆయన మంగళగిరి క్యాంపు కార్యాలయం నుంచి వర్చువల్‌గా పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు, రాజోలు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్, కోనసీమ జిల్లా కలెక్టర్, జల వనరుల శాఖ అధికారులు, ఇతర అధికారులు

- మిగతా 2 లో

## సూపర్ సిక్స్ సూపర్‌హిట్

- కూటమి సర్కారు 2025 సంవత్సరంలో అమలు చేసిన సూపర్ సిక్స్ పథకాలు సూపర్‌హిట్‌గా నిలిచాయ
- సీఎం చంద్రబాబు
- స్త్రీశక్తి పథకం ద్వారా 3.25 కోట్ల మంది మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం
- 2025 సంవత్సరంలో అమలు చేసిన సూపర్ సిక్స్ పథకాలు సూపర్‌హిట్‌గా నిలిచాయన్న చంద్రబాబు
- దాదాపు 204 అన్న క్యాంటీన్ల ద్వారా 4 కోట్ల భోజనాలు అందాయని సీఎం చంద్రబాబు తెలిపారు
- విశాఖలో ఐటీ హబ్, గూగుల్, రిలయన్స్ డేటా సెంటర్లు టీసీఎస్ ప్రారంభం, కాగ్నిజెంట్‌కు శంకుస్థాపన, క్వాంటం వ్యాలీకి తొలిఅడుగు, అమరావతి పనులు వేగవంతం కూటమి విజయాలే అని తెలిపారు



ఏపీలో ఆగస్టు 15వ తేదీ నుంచి ప్రారంభమైన స్త్రీశక్తి పథకం ద్వారా 3.25 కోట్ల మంది మహిళలు ఉచిత బస్సుల్లో ప్రయాణించారని సీఎం చంద్రబాబు వెల్లడించారు. దీనికి గాను 1,144 కోట్లు ఖర్చయింది. దాదాపు 204 అన్న క్యాంటీన్ల ద్వారా 4 కోట్ల భోజనాలు అందాయని తెలిపారు. కూటమి సర్కారు 2025 సంవత్సరంలో అమలు చేసిన సూపర్ సిక్స్ పథకాలు సూపర్‌హిట్‌గా నిలిచాయనీ, ఎన్టీఆర్ భరోసా పింఛన్ల ద్వారా ఇప్పటికే 50,000 కోట్లకు పైగా ఖర్చు చేశామని సీఎం చంద్రబాబు మంత్రివర్గంలో 2025 పాలనలో ముఖ్యాంశాలను స్వయంగా తెలియజేశారు.2025 సంవత్సరంలో కూటమి ప్రభుత్వ విజయాలను అమరావతి సచివాలయంలో మంత్రివర్గ సమావేశం ముగిశాక - మిగతా 2 లో

# సంపాదకీయం

## ఏమైంది ఆ స్వదేశీ నినాదం

ఇన్సూరెన్స్ రంగంలో విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులను 74శాతం నుంచి 100శాతానికి పెంచడాన్ని దేశీయ కంపెనీలు గానీ, ప్రజానీకం గానీ కోరుకోలేదు. కేవలం విదేశీ పెట్టుబడికి తలొగ్గి కేంద్రం ఈ నిర్ణయం తీసుకున్నది.పంద్రాగస్టు సాక్షిగా ప్రధానమంత్రి ఇచ్చిన స్వదేశీ నినాదాన్ని బేఖాతరు చేస్తూ, భారత ఆర్థిక వ్యవస్థపై ఆధిపత్యం చెలాయించుకొమ్మంటూ విదేశస్థులకు పార్లమెంట్ ఆహ్వానాన్ని పలికింది. అందుకేనేమో విదేశీ కంపెనీలు భారత్‌లో ఇన్సూరెన్స్ వ్యాపారం చేసుకోవచ్చనే చట్టం తయారవుతున్న సందర్భంలో ప్రధానమంత్రి విదేశీ యాత్రలో ఉన్నారు!ఇన్సూరెన్స్ రంగంలో విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులను 74శాతం నుంచి 100శాతానికి పెంచడం వల్ల విదేశీ కంపెనీలకు పెద్ద మొత్తంలో అవకాశం (యాక్సెస్) లభిస్తుంది తప్ప, దేశీయ ప్రైవేట్ ఇన్సూరెన్స్ కంపెనీలకు ఎలాంటి లాభమూ ఉండదు. ఇప్పుడున్న 74శాతం ఎఫ్‌డీఐ పరిమితిని ఏ ఒక్క ప్రైవేట్ కంపెనీ పూర్తిగా వినియోగించుకోలేదు. విదేశీ భాగస్వామ్య కంపెనీలు తమకు లభించిన అనుమతి ప్రకారం ఇండియా భాగస్వామితో ప్రారంభించిన కంపెనీలో 74శాతం విదేశీ పెట్టుబడినీ తీసుకురాలేదు. 25 ప్రైవేట్ కంపెనీలలో కలిపి ఇప్పటి వరకు సగటున కేవలం 32.6శాతం మాత్రమే విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు ఉన్నాయి. ఇప్పుడు ఈ ఎఫ్‌డీఐల పరిమితి 100శాతానికి పెంచడం ద్వారా మూడు ప్రమాదాలు పొంచి ఉన్నాయి: 1) విదేశీ కంపెనీలకు స్వదేశీ కంపెనీలు తమ వాటా మొత్తాన్ని అమ్ముకొని ధారాదత్తమైపోవచ్చు. 2) వందశాతం విదేశీ పెట్టుబడితో ఏర్పడబోయే కొత్త ప్రైవేట్ కంపెనీలతో భారత ఇన్సూరెన్స్ మార్కెట్‌పై విదేశీ కంపెనీల ప్రాబల్యం పెరుగుతుంది. 3) భారతదేశ ప్రజల పొదుపుపై విదేశీ కంపెనీల ఆధిపత్యం మరింత పెరుగుతుంది.దేశీయ కంపెనీలు గానీ, లేదా ప్రజానీకం గానీ ఈ పెంపును కోరుకోలేదు. కేవలం విదేశీ పెట్టుబడికి తలొగ్గి కేంద్రం ఈ నిర్ణయం తీసుకున్నది. అంతర్జాతీయ పెట్టుబడి అజమాయిషీ మన దేశంపై ప్రబలంగా ఉందనడానికి ఇది ఇదర్శనం. ఈ ఎఫ్‌డీఐ పెంపు ద్వారా 'సబ్ కా బీమా' సాధించడమనే నినాదం అర్థరహితం. అందరికీ బీమా సౌకర్యాన్ని అందివ్వాలంటే ప్రజల చేతిలో కొనుగోలు శక్తి పెరగాలి తప్ప, విదేశీ కంపెనీలొచ్చి పాలసీలను అమ్మడానికి ప్రయత్నిస్తే జరగదు. పైగా పట్టణ వ్యాపారమంతా విదేశీ కంపెనీలకు ధారాదత్తమయ్యే ప్రమాదముంది. భారతదేశంలో ప్రారంభం కానున్న విదేశీ ఇన్సూరెన్స్ కంపెనీలను పూర్తిగా గ్రామీణ ప్రాంతాలలోనే పనిచేయవలసిందిగా ఆదేశిస్తే తప్ప గ్రామీణ ప్రాంతాల్లో ఇన్సూరెన్స్ విస్తరించే అవకాశమే లేదు.ఇక పార్లమెంట్‌లో బిల్లు ప్రవేశపెడుతున్నప్పుడు, విదేశీ కంపెనీలు తమ లాభాలను తమ దేశాలకు తరలించుకుపోకుండా చూస్తామని నిర్మలా సీతారామన్ అన్నారు. దీనిని రిపాట్రియేషన్ క్లాజ్ అంటారు. నిజానికి 2021 కన్నా ముందు, అనగా ఎఫ్‌డీఐల పరిమితి 49శాతం వరకే ఉన్నప్పటి వరకు, ఈ రీపాట్రియేషన్ క్లాజ్ వర్తించేది. 2021 తర్వాత దీనికి చరమగీతం పాడారు. ఇప్పుడున్న నిబంధనల ప్రకారం విదేశీ కంపెనీలు తాము తీసుకొచ్చిన పెట్టుబడి తరలించడానికి వీలు లేదు కానీ, ఆర్జించిన లాభాలను ఎప్పుడైనా తరలించుకుని పోయే వెసులుబాటు ఉన్నది. 'ప్రజలు దేన్నైనా నమ్ముతారు, వెరిఫై చేసుకోరు' అనే ఒక అంచనాతో పాలకులు ఇలాంటి ప్రకటనలు చేస్తుంటారు.2000 సంవత్సరంలో... ప్రైవేట్ కంపెనీలకు భారత ఇన్సూరెన్స్ మార్కెట్‌లో అవకాశం కల్పిస్తూ నిర్ణయం తీసుకున్న సందర్భంలో, ఆ నిర్ణయాన్ని సమర్థిస్తూ పలు వాదనలు ముందుకువచ్చాయి. భారతదేశంలో ఇన్సూరెన్స్ విస్తరణ చాలా తక్కువగా ఉన్నదనీ, అందుచేత ప్రైవేట్ కంపెనీల ఆగమనంతో దానిని పెంచవచ్చుననీ కొందరు అన్నారు. కొత్త కంపెనీల ఆవిర్భావంతో ఎంతోమందికి ఉపాధి కల్పించవచ్చు అని కూడా అన్నారు. పోటీతత్వం పెరిగి పాలసీ ప్రీమియంల రేట్లు తగ్గి, అవి మరింతగా సామాన్యులకు అందుబాటులోకి వస్తాయన్నారు. కానీ పాతికేళ్ళ క్రితం 3.1శాతం ఉన్న ఇన్సూరెన్స్ విస్తరణ ఈనాటికీ అదేస్థాయిలో 3.5శాతం దగ్గర తచ్చాడుతున్నది. ఉపాధి కల్పన, పోటీతత్వం ద్వారా రేట్లు తగ్గడం అన్న వాదనలు ఏవీ నిజరూపం దాల్చలేదు. ఎందుకంటే ప్రైవేట్ కంపెనీలు ఏవీ పెద్ద ఎత్తున ఉపాధి కల్పించడానికి ముందుకు రాలేదు. మహా అయితే ఏజెంట్ల సంఖ్యలో కొంత పెరుగుదల ఉన్నది. కానీ ఎల్ఐసీ ఏకస్వామ్యమే కొనసాగినా ఇదే స్థాయిలో ఏజెంట్ల రిక్రూట్‌మెంట్ జరిగి ఉండేది. ప్రైవేట్ కంపెనీల్లో విదేశీ కంపెనీలు భాగస్వాములుగా 25 సంవత్సరాల నుంచి పని చేస్తున్నాయి. దఫదఫాలుగా 26శాతం నుంచి 2015లో 49శాతానికి, 2021లో 74శాతానికి ఎఫ్‌డీఐల పరిమితిని పెంచినప్పటికీ ఫలితాలు ఆశించినంతగా రాలేదు. ఏదేమైనా ఆగమేఘాల మీద దేశ ఆర్థిక వ్యవస్థకు పట్టుగొమ్మగా నిలిచే ఇన్సూరెన్స్ చట్ట సవరణను పూర్తిచేశారు. దీనివల్ల ప్రజల పొదుపులపై విదేశీ సంస్థల ప్రభావం ఎక్కువగా పడుతుంది. ప్రతి ఏటా రూ.10,00,000కోట్లకు పైబడి కొత్త ఇన్సూరెన్స్ వ్యాపారం జరుగుతున్నది. ఇది దాదాపు పది రాష్ట్రాల సంవత్సర బడ్జెట్‌తో సమానం! దేశీయ ఇన్సూరెన్స్ మార్కెట్‌ను పూర్తిగా విదేశీ కంపెనీలకు ధారాదత్తం చేసే ఈ చర్యతో తిరోగమన ఫలితాలకు నాంది పలికినట్లే.

## ఇచ్చిన మాట నిలబెట్టుకున్న డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్

**మొదటిపేజీ తరువాయి** – హాజరయ్యారు.ఈ సందర్భంగా పవన్ కల్యాణ్ మాట్లాడుతూ, కోనసీమలోని కొబ్బరి రైతులకు ఇచ్చిన మాటను నిలబెట్టుకుని రూ. 20.77 కోట్ల అంచనా వ్యయంతో శంకరగుప్తం డ్రెయిన్ సమస్యను పరిష్కరించేందుకు చర్యలు ప్రారంభించామని తెలిపారు. ప్రత్యేకంగా, రాజోలు పర్యటనలో 45 రోజుల్లో సమస్యను పూర్తి చేయాలని హామీ ఇచ్చినప్పటికీ, 35 రోజుల్లోపే ఈ డ్రెయిన్ సమస్యకు ప్రభుత్వం పరిష్కారం చూపించింది.డ్రెయిన్ ఆధునికీకరణ ద్వారా జిల్లా అభివృద్ధిలో కొత్త దశ ప్రారంభంకానుంది. శంకరగుప్తంలోని వర్షకాల సమస్యలను సమర్థవంతంగా పరిష్కరించడానికి ఇది దోహదపడనుంది.

## సంక్రాంతి ముంగిట హైవేపై ట్రాఫిక్ కష్టాలు ఉండకూడదు

**మొదటిపేజీ తరువాయి** – రాకపోకలకు అన్ని లేన్‌లు అందుబాటులో ఉండేలా చూడాలని స్పష్టం చేశారు.ట్రాఫిక్ జామ్‌లను నివారించేందుకు కీలకమైన ప్రాంతాల్లో, జంక్షన్ల వద్ద అదనపు ట్రాఫిక్ పోలీసులను మోహరించాలని మంత్రి ఆదేశించారు. అలాగే, ప్రయాణికులకు స్పష్టమైన సమాచారం ఇచ్చేలా సైన్ బోర్డులు, రాత్రి వేళల్లో కనిపించేలా హై విజిబిలిటీ బారికేడ్లను ఏర్పాటు చేయాలని సూచించారు. ప్రజలు సంతోషంగా పండుగను జరుపుకునేలా, వారి ప్రయాణం సాఫీగా సాగేందుకు ప్రభుత్వం పూర్తి బాధ్యతతో పనిచేస్తుందని మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి భరోసా ఇచ్చారు.

## అసెంబ్లీ, మండలిలో బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ల నియమకం



**మొదటిపేజీ తరువాయి** – తెలంగాణ అసెంబ్లీ శీతాకాల సమావేశాలు జరుగుతున్న వేళ, ప్రధాన ప్రతిపక్షం బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ కీలక నిర్ణయం తీసుకున్నారు. అసెంబ్లీ మరియు శాసన మండలిలో పార్టీ తరఫున వ్యవహరించాల్సిన డిప్యూటీ ఫ్లోర్ లీడర్లను ఖరారు చేస్తూ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు.అసెంబ్లీలో బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్లుగా పార్టీ సీనియర్ నేతలు, మాజీ మంత్రులు హరీశ్ రావు, సబితా ఇంద్రారెడ్డి, తలసాని శ్రీనివాస్ యాదవ్‌లను కేసీఆర్ నియమించారు.అలాగే, శాసన మండలిలో డిప్యూటీ ఫ్లోర్ లీడర్లుగా ఎల్. రమణ, పోచంపల్లి శ్రీనివాస్ రెడ్డిలకు బాధ్యతలు అప్పగించారు. మండలిలో పార్టీ విప్‌గా దేశపతి శ్రీనివాస్‌ను ఎంపిక చేశారు. సోమవారం నుంచి అసెంబ్లీ సమావేశాలు ప్రారంభమైన నేపథ్యంలో, ఉభయ సభల్లో పార్టీ వ్యూహాన్ని సమర్థవంతంగా అమలు చేసేందుకు కేసీఆర్ ఈ నియామకాలు చేపట్టినట్లు పార్టీ వర్గాలు తెలిపాయి.

# సూపర్ సిక్స్ సూపర్‌హిట్

**మొదటిపేజీ తరువాయి** – సహచర మంత్రులతో పంచుకున్నారు. విశాఖలో ఐటీ హబ్, గూగుల్, రిలయన్స్ డేటా సెంటర్లు టీసీఎస్ ప్రారంభం, కాగ్నిజెంట్‌కు శంకుస్థాపన, క్వాంటం వ్యాలీకి తొలిఅడుగు, అమరావతి పనులు వేగవంతం తదితరాలన్నీ కూటమి విజయాలే అని తెలిపారు. తల్లికి వందనం పథకం కింద 67.27 లక్షల మంది విద్యార్థులకు రూ.10,090 కోట్లు చెల్లించామని సీఎం వివరించారు.మెగా డీఎస్సీ ద్వారా 15,941 ఉపాధ్యాయ పోస్టులు భర్తీ చేశామన్నారు. 5,757 కానిస్టేబుళ్ల నియామకం పూర్తి చేశామని చెప్పారు. 1వ తరగతి నుంచి ఇంటర్మీడియట్ వరకు 75 లక్షల మంది విద్యార్థులకు ఆరోగ్య పరీక్షలు చేసినట్లు వెల్లడించారు. డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకం అమలు చేస్తున్నామని సర్వేపల్లి రాధాకృష్ణ కిట్స్ అందించామన్నారు. పారదర్శకంగా ఉపాధ్యాయ బదిలీలు నిర్వహించడం సహా విద్యావ్యవస్థలో పెనుమార్పులకు నాంది పలికామని గుర్తుచేశారు. మెగా పేరెంట్స్, టీచర్స్ మీటింగ్ నిర్వహించామని వివరించారు. రాష్ట్రమంతా ఒకే రోజు 13,326 గ్రామసభలు నిర్వహించి 3,000 పనులకు శ్రీకారం చుట్టామని సీఎం తెలిపారు.అడవితల్లి బాటలో తండాలకు రోడ్లు నిర్మిస్తున్నామని శివారు గ్రామాలకు 4జీ నెట్‌వర్క్ ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. కుంకీ ఏనుగులు రాష్ట్రానికి తీసుకొచ్చామన్నారు. అమరజీవి జలధార పేరుతో 1.21 కోట్ల మందికి దాహార్తి తీర్చేలా ప్రతి ఇంటికి కుళాయి కనెక్షన్లు ఇచ్చేందుకు రూ.3,050 కోట్లతో ప్రాజెక్టు రూపొందిస్తున్నట్లు



సీఎం తెలియజేశారు. అన్నదాత సుఖీభవ కింద 46 లక్షల మంది రైతుల ఖాతాల్లో రూ.6,310 కోట్లను జమ చేసినట్లు చంద్రబాబు తెలిపారు. మార్కెట్ జోక్యం ద్వారా పొగాకు, మామిడి, కోకో, ఉల్లి సహా పలు పంటల కొనుగోలు చేశామని గుర్తు చేశారు. రికార్డు స్థాయిలో 8,120 కోట్లతో 34.23 లక్షల టన్నుల ధాన్యం సేకరించి 24 గంటల్లో నగదు జమ చేశామని పేర్కొన్నారు. దీపం పథకం కింద రూ.2,684 కోట్లతో 2 కోట్ల ఉచిత సిలిండర్లు పంపిణీ చేసినట్లు చెప్పారు. మత్స్యకార భరోసా ద్వారా ఏడాదికి 20,000 చొప్పున 1.25 లక్షల మందికి రూ.250 కోట్లు, ఆటోడ్రైవర్ల సేవలో ఏడాదికి 15,000 చొప్పున 2.90 లక్షల మందికి రూ. 436 కోట్లును అందించినట్లు సీఎం వివరించారు.నేతన్నలకు ఉచిత విద్యుత్తు పథకం కింద మరమగ్గాలకు నెలకు 500 యూనిట్లు, మగ్గాలకు 200 యూనిట్లు సరఫరా చేస్తున్నట్లు సీఎం చంద్రబాబు తెలిపారు. అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆశాలకు గ్రాట్యుటీ అమలు చేశామన్నారు. మొత్తం రూ.1000 కోట్ల వ్యయంతో రహదారులకు మరమ్మతులు చేశామని చెప్పారు. కూటమి ప్రభుత్వ హయాంలో రాష్ట్రంలో నేరాల రేటు తగ్గిందని వెల్లడించారు. ఈగల్ టాస్క్‌ఫోర్స్ ఏర్పాటు ద్వారా గంజాయి, మాదకద్రవ్యాల సరఫరా అరికట్టామని స్పష్టం చేశారు. విశాఖపట్నం, అమరావతి, తిరుపతి మూడు రీజియన్ల ద్వారా అభివృద్ధి ప్రణాళికలను రూపొందించి అమలు చేస్తున్నట్లు వివరించారు.పూర్వోదయ పథకంలో రాష్ట్రానికి చోటు దక్కిందని చంద్రబాబు తెలిపారు. విశాఖ రైల్వేజోన్ ప్రధాన కార్యాలయ పనులు జరుగుతున్నాయని సీఎం వివరించారు. కేంద్రంతో సమన్వయం ద్వారా 90 పథకాల్ని పునరుద్ధరించామని గుర్తు చేశారు. సెమీకండక్టర్ పరిశ్రమల ఏర్పాటుతో పాటు కేంద్రం నుంచి స్టీల్‌ప్లాంట్‌కు రూ.11,440 కోట్లు ఊతం లభించిందని చెప్పారు.దాదాపు లక్ష కోట్ల విలువైన జాతీయ రహదారులు, రైల్వే ప్రాజెక్టుల పనులు జరుగుతున్నాయని వెల్లడించారు. 20 లక్షల ఎస్సీ, ఎస్టీ కుటుంబాలకు ఉచితంగా సోలార్ రూఫ్‌టాప్, బీసీలకు రూ. 20,000 చొప్పున అదనపు సాయాన్ని అందిస్తున్నట్లు ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు వివరించారు.

## త్వరలో పోలీస్ ఉద్యోగాల నియామకాల కోసం కసరత్తు!

**మొదటిపేజీ తరువాయి** – రాష్ట్ర పోలీస్ వార్షిక నివేదిక విడుదల చేసిన డీజీపీ శివధర్‌రెడ్డి తెలంగాణలో శాంతి భద్రతలు పూర్తిగా అదుపులో ఉన్నాయని తెలిపారు. తెలంగాణ గ్రామ పంచాయతీ ఎన్నికలను ప్రశాంతంగా నిర్వహించమని గుర్తు చేశారు. నిజామాబాద్, కామారెడ్డి జిల్లాల్లో వచ్చిన వరదలను సమర్థవంతంగా ఎదుర్కొన్నామని అన్నారు. గతంలో ఎప్పుడూ ఇలాంటి వరదలు నిజామాబాద్‌లో రాలేదని, వరదల సమయంలో పోలీస్ సిబ్బంది బాగా పని చేసి ప్రాణ నష్టం లేకుండా చూశారని, పోలీసులు పని తీరును కొనియాడురు. తెలంగాణలో 509 మంది మావోయిస్టులు లొంగిపోయారని డీజీపీ శివధర్‌రెడ్డి తెలిపారు. ఎలాంటి సమస్యలు లేకుండా మిస్ వరల్డ్ ఈవెంట్‌ను ఘనంగా నిర్వహించుకున్నామని, ఫుట్‌బాల్ ఆటగాడు మెస్సీ ఈవెంట్‌కు ఎలాంటి ఇబ్బందులు తలెత్తలేదని, రాష్ట్రంలో వివిధ కేసులను లోక్‌అదాలత్‌లో పెద్ద సంఖ్యలో పరిష్కరించామని పేర్కొన్నారు. పోలీస్ శాఖలో కీలక పదవుల్లో మహిళా అధికారులు పని చేస్తున్నారని అన్నారు. ఫోన్ల రికవరీ విషయంలో దేశంలో తెలంగాణ నంబర్ వన్‌లో ఉందని వివరించారు.సైబర్ క్రైమ్ విషయంలో తెలంగాణ రాష్ట్రంలో 3 శాతం తగ్గిందన్న శివధర్‌రెడ్డి దేశంలో సైబర్ క్రైమ్ 41 శాతం పెరిగిందని తెలిపారు. రాష్ట్ర సైబర్ క్రైమ్ పోలీసులు సమర్థవంతంగా పని చేయడంతో 3 శాతం తగ్గిందని కొనియాడారు. గతంతో పోలిస్తే 2.33 శాతం క్రైమ్ రేట్ తగ్గిందని చెప్పారు. గతంలో 2.34 లక్షల కేసుల నమోదు కాగా ఇప్పుడు 2.28 లక్షల కేసులు నమోదయ్యాయని తెలిపారు.గతంతో పోలిస్తే శిక్ష పడిన కేసుల సంఖ్య 3 శాతం పెరిగిందని, ఈ ఏడాది నాలుగు కేసుల్లో మరణ శిక్షలు పడ్డాయని డీజీపీ గుర్తు చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా హత్యలు 8.76 శాతం తగ్గాయని, అత్యాచారాలు 13.45 శాతం తగ్గాయని, దోపిడీలు 27 శాతం తగ్గాయని, దొంగతనాలు 9.1 శాతం తగ్గాయని వివరించారు. నమ్మక ద్రోహం కేసులు 23 శాతం పెరిగాయని అన్నారు. వరకట్న కోసం మహిళల హత్యలు తగ్గాయన్నారు. వరకట్న వేధింపుల కేసులు 2 శాతం తగ్గాయని



తెలిపారు. మహిళా భద్రత కోసం షీటీంలు యాక్టివ్‌గా పని చేస్తున్నాయని పేర్కొన్నారు.ఎస్సీ, ఎస్టీ కేసులు 9.5 శాతం తగ్గాయని, సైబర్ క్రైమ్ కేసుల్లో రికవరీ 23 శాతం పెరిగిందని తెలిపారు. ఈ ఏడాది రూ.246 కోట్లు రికవరీ చేశామని, 24,498 మంది బాధితులకు రూ.159.65 కోట్లు రిఫండ్ కూడా చేశామని, త్వరలో పోలీస్ ఉద్యోగాల నియామకాల కోసం కసరత్తు చేస్తున్నామని వివరించారు.

# ఘనంగా వైకుంఠ ఏకాదశి వేడుకలు

**మొదటిపేజీ తరువాయి** – గ్రామాల్లోని వెంకటేశ్వరస్వామి ఆలయాలు ఆధ్యాత్మిక శోభను సంతరించుకున్నాయి. విజయవాడ లబ్బీపేటలో వెంకటేశ్వరస్వామి ఆలయంలో స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం వైకుంఠ ద్వారాలను తెరిచి దర్శనానికి అనుమతించారు. భక్తులకు అసౌకర్యం కలగకుండా తాగునీరు, పాలు ఏర్పాటు చేశారు. గన్నవరంలోని శ్రీవెంకటేశ్వరస్వామి దర్శనం కోసం భక్తులు కిలోమీటర్ల మేర బారులు తీరారు.వైకుంఠ ఏకాదశి సందర్భంగా కడప జిల్లాలోని ఆలయాలు తెల్లవారుజామున నుంచే భక్తులతో రద్దీగా మారాయి. కడపలోని తిరుమల తొలిగడప దేవుని కడప శ్రీ వెంకటేశ్వరస్వామి ఆలయం, ఒంటిమిట్ట శ్రీ కోదండరామయ్య స్వామి ఆలయాలకు తెల్లవారుజామున రెండు గంటల నుంచే భక్తులు పోటెత్తారు. ఉత్తర ద్వార దర్శనం ద్వారా స్వామివారిని దర్శించుకుని పునీతులయ్యారు. భక్తులకు ఇబ్బందులకు కలగకుండా నిర్వాహకులు ఏర్పాట్లు చేశారు.జమ్మలమడుగులోని శ్రీ నారాపుర వెంకటేశ్వరస్వామి దేవాలయంలో భక్తుల సందడి నెలకొంది. ఆలయ పూజారులు వైకుంఠ ఏకాదశి విశిష్టతను భక్తులకు తెలియజేశారు. కోనసీమ తిరుమలగా పేరుగాంచిన ఆత్రేయపురం మండలం వాడపల్లి వెంకటేశ్వర స్వామి ఆలయంలో వైకుంఠ ఏకాదశి వేడుకలు ఘనంగా జరిగాయి. ఆలయాన్ని వివిధ రకాల పుష్పాలతో అందంగా అలంకరించారు. భక్తులు వేల సంఖ్యలో తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు.అనంతపురం జిల్లా రాయదుర్గం కోటలో వెలసిన సుప్రసిద్ధ శ్రీదేవి భూదేవి సమేత శ్రీ ప్రసన్న వెంకటేశ్వరస్వామికి అర్చకులు వేదమంత్రోచ్ఛరణల నడుమ ప్రత్యేక పూజలు నిర్వహించారు. శ్రీవారిని దర్శించుకోవడానికి భక్తులు పెద్ద ఎత్తున బారులు తీరారు. ఉరవకొండ శ్రీవెంకటేశ్వరస్వామి, బెలుగుప్ప మండలం శ్రీరంగాపురం రంగనాథస్వామి ఆలయాల్లో వైకుంఠ ఏకాదశి వేడుకలు అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి. పెద్ద సంఖ్యలో భక్తులు తరలివస్తుండడంతో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీసులు చర్యలు చేపట్టారు. ప్రకాశం జిల్లాలోని యర్రగొండపాలెం, కనిగిరి, పామూరు మండలాల్లోని ఆలయాలు గోవిందా నామస్మరణతో మార్మోగాయి. విష్ణుమూర్తి ఉత్తర ద్వారం ద్వారా ప్రత్యేక అలంకరణతో భక్తులకు దర్శనమిచ్చారు. రాజమహేంద్రవరం మెయిన్ రోడ్డులోని వెంకటేశ్వరస్వామి ఆలయంలో వైకుంఠ ద్వార దర్శనం ద్వారా భక్తులు విష్ణుమూర్తిని దర్శించుకున్నారు. ఉత్సవ మూర్తులను వివిధ పుష్పాలు, కరెన్సీ నోట్లతో అలంకరించారు. గోదావరి జిల్లాల్లో ముక్కోటి ఏకాదశి పూజలను భక్తులు ఘనంగా నిర్వహించారు. వెంకటేశ్వర స్వామి ఆలయాలతో పాటు పలు ఆలయాలను దర్శించుకునేందుకు భక్తులు బారులు తీరారు. ప్రధానంగా వెంకటేశ్వర స్వామి ఆలయాల వద్ద ఉత్తర ద్వారా దర్శనం కోసం భక్తులు



బారులు తీరి స్వామివారిని భక్తులు దర్శనం చేసుకున్నారు. అమలాపురం అంబాజీపేట లంకల గన్నవరం అప్పనపల్లి బెండమూర్లంక తదితర గ్రామాలలో వెంకటేశ్వర స్వామి ఆలయాల్లో భక్తులు కిటకిటలాడారు.వైకుంఠ ఏకాదశిని పురస్కరించుకుని తిరుమలలో స్వర్ణ రథోత్సవం వైభవంగా నిర్వహించారు. రథంపై శ్రీదేవి, భూదేవి సమేత మలయప్పస్వామి ఊరేగుతూ భక్తులకు అభయప్రదానం చేశారు. మరోవైపు ఉత్తర ద్వార దర్శనం కోసం పెద్ద ఎత్తున భక్తులు తిరుమలకు తరలి వస్తున్నారు.

## దేశంలో భారీగా తగ్గిన ఏటీఎంల సంఖ్య



**మొదటిపేజీ తరువాయి** – దేశంలో డిజిటల్ చెల్లింపుల వినియోగం భారీగా పెరగడంతో ఏటీఎంల అవసరం క్రమంగా తగ్గుతోంది. 2025 ఆర్థిక సంవత్సరంలో దేశవ్యాప్తంగా ఏటీఎంల సంఖ్య భారీగా తగ్గిందని రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా తాజాగా విడుదల చేసిన 'ట్రెండ్ అండ్ ప్రోగ్రెస్ ఆఫ్ బ్యాంకింగ్' నివేదికలో వెల్లడించింది. నిర్వహణ ఖర్చులు పెరగడం, ఆన్‌లైన్ లావాదేవీలకు ప్రజలు మొగ్గుచూపుతుండటంతో బ్యాంకులు ఏటీఎంల సంఖ్యను తగ్గించుకుంటున్నాయి.ఆర్‌బీఐ నివేదిక ప్రకారం 2024 మార్చి నాటికి 2,53,417గా ఉన్న ఏటీఎంల సంఖ్య.. 2025 మార్చి 31 నాటికి 2,51,057కు పడిపోయింది. ముఖ్యంగా ప్రైవేట్ రంగ బ్యాంకులు తమ ఏటీఎం నెట్‌వర్క్‌ను భారీగా కుదించుకున్నాయి. గత ఏడాది 79,884గా ఉన్న ప్రైవేట్ బ్యాంక్ ఏటీఎంలు, ఈ ఏడాది 77,117కు తగ్గాయి. ప్రభుత్వ రంగ బ్యాంకుల్లో కూడా ఈ సంఖ్య 1,34,694 నుంచి 1,33,544కు స్వల్పంగా తగ్గింది. ఆఫ్-సైట్ ఏటీఎంల మూసివేత ఇందుకు ప్రధాన కారణమని తెలుస్తోంది.అయితే, బ్యాంకేతర సంస్థలు నిర్వహించే వైట్ లేబుల్ ఏటీఎంల (%ఔష్ట్రఉవ ఝుఎవశ్రీ ౕుఎం%) సంఖ్య మాత్రం 34,602 నుంచి 36,216కు పెరగడం విశేషం. ఇక ఏటీఎంల విస్తరణ విషయంలో.. ప్రభుత్వ బ్యాంకులు గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో సమానంగా సేవలు అందిస్తుండగా, ప్రైవేట్ బ్యాంకులు మాత్రం ఎక్కువగా మెట్రో నగరాలకే పరిమితమయ్యాయి.మరో ఆసక్తికరమైన విషయం ఏంటంటే.. ఏటీఎంలు తగ్గుతున్నప్పటికీ, బ్యాంక్ బ్రాంచుల సంఖ్య మాత్రం పెరుగుతూనే ఉంది. 2025 మార్చి నాటికి దేశంలో బ్యాంక్ శాఖల సంఖ్య 2.8 శాతం పెరిగి 1.64 లక్షలకు చేరింది. కొత్త బ్రాంచుల ఏర్పాటులో ప్రైవేట్ బ్యాంకుల కంటే ప్రభుత్వ రంగ బ్యాంకులే దూకుడుగా ఉన్నాయని ఆర్బీఐ నివేదిక స్పష్టం చేసింది.

## 2026 జనవరి 1 నుంచి అమలు కానున్న ఆర్థిక మార్పులు!



**మొదటిపేజీ తరువాయి** – **పాన్-ఆధార్ అనుసంధానం కీలకం**

ప్రధానంగా పాన్-ఆధార్ అనుసంధానం అత్యంత కీలకం కానుంది. ఇప్పటికీ వీటిని లింక్ చేయని వారి బ్యాంక్ ఖాతాలు ఫ్రీజ్ అయ్యే ప్రమాదం ఉంది. బ్యాంకింగ్ సేవలు, పన్ను రిఫండ్లు నిలిచిపోకుండా ఉండాలంటే తక్షణం ఈ ప్రక్రియ పూర్తి చేయాల్సిందే. ఇక, కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులకు శుభవార్తగా, 2025 డిసెంబర్ 31తో 7వ వేతన సంఘం గడువు ముగియనుండటంతో జనవరి 1 నుంచి 8వ వేతన సంఘం సిఫార్సులు అమల్లోకి రానున్నాయి. దీనివల్ల ఉద్యోగులు, పెన్షనర్ల వేతనాల్లో మార్పులు చోటుచేసుకోనున్నాయి.

**క్రెడిట్ స్కోర్ అప్డేట్**

బ్యాంకింగ్ రంగంలో మరో ప్రధాన మార్పు క్రెడిట్ స్కోర్ అప్డేట్. ఇప్పటివరకు 15 రోజులకోసారి జరిగే ఈ ప్రక్రియ, ఇకపై ప్రతి వారం జరగనుంది. దీనివల్ల లోన్ రీపేమెంట్లలో ఏ చిన్న జాప్యం జరిగినా వెంటనే క్రెడిట్ స్కోర్‌పై ప్రభావం పడుతుంది.పీఎం కిసాన్ పథకంలో కొత్తగా చేరే రైతులకు 'ఫార్మర్ ఐడీ' తప్పనిసరి చేశారు. జనవరి 1 నుంచి కొత్త దరఖాస్తుదారులు ఈ డిజిటల్ ఐడీ ద్వారానే రూ.6,000 సాయం పొందేందుకు అర్హత సాధిస్తారు.

**యూపీఐ లావాదేవీలు, సిమ్ వెరిఫికేషన్ నిబంధనలు మరింత కఠినతరం**

వీటితో పాటు 2026 జనవరి నుంచి వచ్చే కొత్త ఐటీఆర్ ఫారాల్లో బ్యాంకింగ్, ఖర్చుల వివరాలు ప్రీ-ఫిల్ అయి రానున్నాయి. అలాగే, ప్రతి నెల మొదటి తేదీన జరిగే ఎల్‌పీజీ, విమాన ఇంధన ధరల సవరణ కూడా జరగనుంది. డిజిటల్ మోసాలను అరికట్టేందుకు యూపీఐ లావాదేవీలు, సిమ్ వెరిఫికేషన్ నిబంధనలను మరింత కఠినతరం చేయనున్నారు. ఆర్బీఐ కొత్త నిబంధనల ప్రకారం కో-లెండింగ్ విధానంలోనూ మార్పులు రానున్నాయి.

# కొత్తకొండ జాతరకు ఘనమైన చరిత్ర.. "గతుకుల బాట!"

ముల్కనూరు - కొత్తకొండ రహదారిపై పొంచి ఉన్న ముప్పు



కాకతీల కట్టడం త్రికుటేశ్వర ఆలయం





## బ్రహ్మసూత్రం గల శివలింగం

**భీమదేవరపల్లి, డిసెంబర్ 30 ప్రజామంటలు ప్రతినిధి కాశిరెడ్డి ఆదిరెడ్డి**

కాకతీయుల కాలం నాటి ఘన చరిత్ర కలిగిన కొత్తకొండ వీరభద్ర స్వామి దేవస్థానం సంక్రాంతి జాతరకు సిద్ధమవుతోంది. దక్షిణ కాశీగా పేరుగాంచిన ఈ పవిత్ర క్షేత్రంలో కొలువైన వీరభద్ర స్వామిని దర్శించుకునేందుకు ఈసారి కూడా లక్షలాది మంది భక్తులు తరలిరానున్నారు. అయితే, ఈ జాతరకు వెళ్లే ముల్కనూరు - కొత్తకొండ ప్రధాన రహదారి మాత్రం భక్తుల్లో ఆందోళన కలిగిస్తోంది. సంప్రదాయబద్ధంగా జరిగే ఎడ్లబండ్ల రథయాత్రలకు ఈ రోడ్డు ఇప్పుడు పెద్ద సవాలుగా మారింది.

**చరిత్రలో కొత్తకొండ ఆచారాల వెనుక కథ**

కొత్తకొండ గుట్టపై వెలసిన వీరభద్ర స్వామి స్వయంభువుగా ప్రసిద్ధి. దక్షయజ్ఞం విధ్వంసం అనంతరం శాంతి కోసం స్వామివారు ఇక్కడ తపస్సు చేశారని పురాణాలు చెబుతున్నాయి. ఇక్కడ సాధారణంగా దేవుళ్లకు కొబ్బరికాయలు కొట్టే ఆచారం కాకుండా గుమ్మడికాయలు సమర్పించడం ప్రత్యేకత. గుట్టపై ఉన్న కోనేరులో ఎండాకాలంలోనూ నీరు ఇంకిపోకపోవడం స్వామివారి మహిమగా భక్తులు విశ్వసిస్తారు. ఈ జాతరలో మూడు ముఖ్యమైన సంప్రదాయ ఆచారాలు ఉన్నాయి. వీటన్నింటికీ భక్తులు ప్రమాదకర రహదారుల మీదుగా ప్రయాణించాల్సి వస్తోంది.

**కుమ్మరి వారి బోనం (తొలిపూజ)**

గుట్టపై స్వామివారి విగ్రహాన్ని తొలిసారిగా గుర్తించిన కడిపికొండ, ఉల్లిగడ్డ దామెర గ్రామాల కుమ్మరి కులస్తులకు తొలి పూజ హక్కు ఉంది. వారు ఎడ్లబండ్లపై వచ్చి "వీరబోనం" సమర్పిస్తారు. యాదవుల 'మేకల బండ్లు'ఉప్పరపల్లి గ్రామం నుంచి యాదవులు పశుసంపద క్షేమార్థం మేకపోతుల రథాలతో అంగరంగ వైభవంగా వస్తారు.

**కొత్తపల్లి నుండి ఎడ్లబండ్లు**

## కుమ్మరుల మేకల రథం

జాతరలో హైలైట్‌గా నిలిచేది కొత్తపల్లి గ్రామం నుంచి సాయంత్రం వేళ బయలుదేరే 60 నుంచి 70 ఎడ్లబండ్ల భారీ యాత్ర. విద్యుత్ దీపాల అలంకరణలు, డప్పు చప్పుళ్లతో సాగే ఈ యాత్ర కనుల పండుగగా మారుతుంది.

**ఘన చరిత్ర - నరకయాత్ర**

ఇంతటి విశిష్ట ఆచారాలు ఉన్నా, ప్రయాణం మాత్రం భక్తులకు నరకప్రాయంగా మారింది. కొత్తపల్లి బండ్లకు గండం రాత్రివేళ వరుసగా వచ్చే ఎడ్లబండ్లకు గుంతలు, కోతకు గురైన రోడ్డు అంచులు మృత్యుపాశాలుగా మారుతున్నాయి.

**కుమ్మరి, మేకల బండ్ల ఇబ్బందులు**

అలంకరించిన భారీ రథాల చక్రాలు గుంతల్లో దిగితే తిరగబడే ప్రమాదం పొంచి ఉంది. అధికారులు బ్లైండ్ స్పాట్స్ వద్ద తక్షణమే సైన్ బోర్డ్స్, వీధి దీపాలు ఏర్పాటు చేయాలి.

**రేడియంతో హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలి**

జాతరలో గుంతలు పూడ్చి వీలు కాకపోతే రేడియం హెచ్చరిక బోర్డులు పెట్టాలి. రోడ్డుకి అడ్డంగా ఉన్న చెట్ల పొదలను తొలగించి రథాలకు సురక్షిత మార్గం కల్పించాలి. కొత్తపల్లి గ్రామానికి చెందిన రాగం రమేష్ మాట్లాడుతూ, "మా తాతల కాలం నాటి ఆచారాలను కొనసాగిస్తున్నాం. మాకు లగ్జరీలు వద్దు%ొ% కనీసం క్షేమంగా గుడికి చేరే రోడ్డు కావాలి," అని భక్తులు వేడుకుంటున్నారు.

**పీవీ కుటుంబ రథం - ఒక సెంటిమెంట్**

ఈ ప్రాంతం పి.వి. నరసింహారావు నడయాడిన నేల. జాతర సందర్భంగా వంగర గ్రామం నుంచి పీవీ కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో వచ్చే ప్రత్యేక రథం ప్రధాన ఆకర్షణ. ఆ రథం ప్రయాణించే వంగర- ముల్కనూరు - కొత్తకొండ దారి ప్రస్తుతం అధ్వానంగా ఉండటంపై ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. "దేశాన్ని పాలించిన మహానుభావుడి కుటుంబ రథానికి కూడా కనీస సౌకర్యాలు కల్పించలేరా?" అని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. ఇంతటి చారిత్రక, ఆధ్యాత్మిక వైభవం ఉన్న కొత్తకొండ జాతరలో ఏ చిన్న నిర్లక్ష్యం కూడా పెను ప్రమాదాలకు దారి తీసే అవకాశం ఉంది. మరి అధికారులు ఇప్పటికైనా స్పందించి భక్తుల ప్రాణాలను కాపాడతారా? లేక ప్రమాదాల తర్వాతే మేల్కొంటారా? అన్నది వేచి చూడాల్సిందే.

**మట్టిలో మాణిక్యం.. ముత్తారం 'త్రికూటాలయం'!**

రామప్పను తలపించే కాకతీయ శిల్పకళ..ఆదరణ లేక మరుగున పడుతున్న చరిత్ర కొత్తకొండ జాతర రూట్‌లోనే అద్భుత కట్టడం ఉంది. కాకతీయుల కాలం నాటి శిల్పకళా వైభవానికి సాక్ష్యాలుగా నిలిచిన వేయిస్తంభాల గుడి, రామప్ప దేవాలయాల గురించి అందరికీ తెలుసు. కానీ, అచ్చం అదే స్థాయిలో, అదే శిల్పకళా నైపుణ్యంతో మన కళ్ల ముందే, మన ముత్తారం గ్రామంలో ఉన్న ' త్రికూటేశ్వరాలయం' మాత్రం సరైన గుర్తింపు లేక మరుగున పడిపోతోంది.

**రాతి కట్టడం.. అద్భుత శిల్ప సంపద**

ముత్తారం గ్రామంలోని ఈ శివాలయం కాకతీయుల కాలం నాటి ఇంజనీరింగ్ అద్భుతాలకు నిదర్శనం. త్రికూట నిర్మాణం మూడు గర్భగుళ్లతో నిర్మించిన ఈ ఆలయం, సాక్షాత్తు వరంగల్ వేయిస్తంభాల గుడిని పోలి ఉంటుంది.

## గతకుల రోడ్డు

**నగిషీల సోయగం**

రాతి స్తంభాలపై చెక్కిన సూక్ష్మమైన నగిషీలు, ద్వారబంధాల వద్ద ఉన్న శిల్పకళ చూపరులను కట్టిపడేస్తుంది. శతాబ్దాలు గడుస్తున్నా, ఈ రాతి కట్టడం ఇప్పటికీ చెక్కుచెదరకపోవడం నాటి నిర్మాణ నైపుణ్యానికి నిదర్శనం.

**జాతర దారిలో ఆధ్యాత్మిక శోభ**

ప్రసిద్ధ కొత్తకొండ జాతరకు వెళ్లే ప్రధాన రహదారిలోనే ఈ ఆలయం ఉండటం ఒక వరం. జాతరకు తరలివచ్చే లక్షలాది మంది భక్తులు, ముల్కనూరు మీదుగా కొత్తకొండ వెళ్లేటప్పుడు ఈ ఆలయాన్ని దర్శించుకునే అవకాశం ఉంది. కానీ, ఆలయానికి సంబంధించిన సరైన సూచిక బోర్డులు లేకపోవడం, ఆలయ ప్రాంగణం అభివృద్ధికి నోచుకోక పోవడంతో చాలామంది భక్తులు దీనిని గమనించకుండానే వెళ్లిపోతున్నారు.

**పర్యాటక కేంద్రంగా మారే అర్హత**

కేవలం భక్తి కోసమే కాదు, చరిత్రను అధ్యయనం చేసే వారికి, పర్యాటకులకు ఈ ఆలయం ఒక అద్భుతమైన గమ్యస్థానం. ప్రభుత్వం, పురావస్తు శాఖ చొరవ తీసుకుని ఈ ఆలయాన్ని అభివృద్ధి చేస్తే, ఇది జిల్లాలోనే గొప్ప పర్యాటక కేంద్రంగా మారుతుంది.

**కొత్త వెలుగులు**

ఆలయ ప్రాంగణంలో గార్డెనింగ్, రాత్రి వేళల్లో విద్యుత్ కాంతులు, పర్యాటకులకు కనీస సౌకర్యాలు కల్పిస్తే ముత్తారం గ్రామం పర్యాటక చిత్రపటంలో నిలుస్తుంది.

**గ్రామస్తుల, చరిత్రకారుల విజ్ఞప్తి**

"మా ఊరిలో ఇంతటి గొప్ప చారిత్రక సంపద ఉండటం మా అదృష్టం. కానీ అధికారులు దీనిని పట్టించుకోక పోవడమే బాధాకరం. కొత్తకొండ జాతర నిధుల నుండైనా కొంత కేటాయించి, ఈ త్రికూటాలయానికి పూర్వ వైభవం తీసుకురావాలి," అని స్థానిక ప్రజలు, చరిత్రకారులు కోరుతున్నారు. మట్టిలో కలిసిపోతున్న మాణిక్యాన్ని వెలికితీసి, భావితరాలకు ఈ చరిత్రను అందిస్తారా? లేక కాలగర్భంలో కలిసిపోనిస్తారా? అనేది అధికారుల చేతుల్లోనే ఉంది..



# ఆలయాలలో వైకుంఠ ఏకాదశి వేడుకలు

**స్వామి వారి పల్లకి సేవ ,అలాయలలో ప్రదక్షిణలు**

**ఉత్తర ద్వారం ద్వారా దర్శనం చేసుకున్న భక్తులు**



**ఇబ్రహీంపట్నం డిసెంబర్ 30(ప్రజ మంటలు దగ్గుల అశోక్) :** జగిత్యాల జిల్లా ఇబ్రహింపట్నం మండలం లోని గోదుర్, తిమ్మపుర్, యామపుర్, పకిర్ కోండా పుర్, వేములకుర్తి, ఎర్దండి, కోమటీకోండాపుర్, వర్షకోండ, ఇబ్రహీంపట్నం, డబ్బ గ్రామాలలో వైకుంఠ ఏకాదశి వేడుకలు మంగళవారం ఘనంగా జరిగాయి. ఈసందర్భంగా గ్రామలలోని శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర స్వామి, గోపాలకృష్ణ స్వామి తదితర ఆల యాలలో ఆలయకమిటీలు స్వామి వారి ఉత్తరద్వారం దర్శనానికి ఏర్పాట్లు చేశారు. మహిళలు భక్తులు అదిక సంఖ్యలో పాల్గొని స్వామి వారి దర్శనం చేసుకున్నారు. అలయంలో స్వామి వారి పల్లకీ సేవ నిర్వహించారు. అనంతరం ధనుర్మాస ఉత్సవాలలో భాగంగా 15 వ పార్షం చెప్పి అర్చకులు నక్షత్ర హారతి, పంచ హారతి, కర్పూర హారతులు ఇచ్చి భక్తులకు తీర్థప్రసాద వితరణ చేశారు. ఈకార్యక్రమంలో తహశీల్దార్ వరప్రసాద్, సర్పంచ్ లు తరి రామనుజం, కనుక నాగేష్, బస శ్రావణ్, బండి రాజేష్,బద్దం గోఫి, కల్లెడ గంగాధర్,పోనుకంటి వెంకటి,ఉపసర్పంచ్ లు బర్మ మల్లయ్య ఆలయకమిటి సభ్యులు, ప్రజాప్రతినిధులు,పలు పార్టీల నాయకులు ,అదికారులు మహిళలు తదితరులు పాల్గొన్నారు.

# ముగింపు సంవత్సరానికి మాత్రమే.. జీవితానికి కాదు..

**న్యూ ఇయర్ వేడుకలు ప్రశాంతంగా జరుపుకోవాలి**

**హద్దు మిరితే చర్యలు తప్పవు**

**ఎస్ఐ, కృష్ణ సాగర్ రెడ్డి**




**గొల్లపల్లి డిసెంబర్ 30 ప్రజా మంటలు :** గొల్లపల్లి మండల ప్రజల కు ముందస్తు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేస్తూ ఎస్ఐ,కృష్ణ సాగర్ రెడ్డి మాట్లాడుతూ నూతన సంవత్సర వేడుకల సందర్భంగా శాంతిభద్రతల పరిరక్షణ ప్రజల రక్షణ ముఖ్యమైనది అందులో భాగంగా మండల ప్రజలకు ముఖ్య సూచనలు రోడ్ల పైన కేక్ కటింగ్ చేయరాదు. సమయపాలన పాటించాలి నిషేధిత పదార్థాల వినియోగం జరిగితే నిర్వాహకులపై కఠిన చర్యలు తీసుకుంటాం డ్రంక్ అండ్ డ్రైవ్ మద్యం సేవించి వాహనం నడిపితే భారీ జరిమానా, లైసెన్స్ రద్దు తో పాటు జైలు శిక్ష తప్పదు మండలం అంతటా ప్రత్యేక తనిఖీ బృందాలు ఉంటాయి, ర్యాష్ డ్రైవింగ్ , బైక్ రేసింగ్, అతివేగం సైలెన్సర్ శబ్దాలతో ఇబ్బంది కలిగించే వాహనాలను సీజ్ చేస్తాము, వేడుకల్లో మహిళల పట్ల అసభ్యంగా ప్రవర్తించే వారిపై పోలీస్ టీమ్స్ నిఘా ఉంటుంది 31 డిసెంబర్ రోజున ముఖ్యమైన ప్రదేశాలలో స్పెషల్ డ్రంక్ అండ్ డ్రైవ్ పరీక్షలు నిర్వహిస్తాం అత్యవసర సమయంలో ఏదైనా సాయం కోసం వెంటనే డైల్ 100 కి చేయండి. మండల ప్రజలందరూ బాధ్యతాయుతంగా వేడుకలు జరుపుకోవాలని ప్రజలందరికి ముందస్తు నూతన సంవత్సర శు భాకాంక్షలు తెలుపుతూ నూతన సంవత్సర వేడుకల్లో మండల ప్రజలందరూ పోలీసులకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

# అర్చక ఉద్యోగులను రెగ్యులర్ చేయాలి



**గంగు ఉపేంద్ర శర్మ**

**భీమదేవరపల్లి, డిసెంబర్ 30 (ప్రజా మంటలు) :** ధూప దీప నైవేద్య అర్చకులను దేవాదాయ శాఖ పరిధిలోకి తెచ్చి, ఆలయాల్లో పనిచేస్తున్న ఔట్ సోర్సింగ్, 4 వ తరగతి సిబ్బందిని వెంటనే రెగ్యులర్ చేయాలని తెలంగాణ అర్చక ఉద్యోగ జేఏసీ చైర్మన్ గంగు ఉపేంద్ర శర్మ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం కొత్తకొండ శ్రీ వీరభద్ర స్వామి ఆలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పాత చట్టాలను సవరించి 6 ఏ, 6 బి, 6 సి కేటగిరీ దేవాలయాల్లోని సుమారు 8 వేల మంది సిబ్బందికి న్యాయం చేయాలని కోరారు. దేవాదాయ శాఖలో 'ఒకే శాఖ - ఒకే వేతన విధానం' అమలు చేయాలని జేఏసీ కన్వీనర్ డి.వి.ఆర్ శర్మ కోరారు. ఈ నెల 2 వ తేదీన మడికొండలో జరిగే అర్చక సదస్సును విజయవంతం చేయాలని వారు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఉప ప్రధాన అర్చకులు రాజయ్య శర్మ, ముఖ్యార్చకులు రాంబాబు, శ్రీకాంత్ శర్మ తదితరులు పాల్గొన్నారు.

## ప్రజా రవాణా సౌకర్యానికి ఎట్టి పరిస్థితుల్లో ఆటంకం కలగకూడదు

**సర్పంచ్ నల్ల నీరజ సతీష్ రెడ్డి , ఉప సర్పంచ్ గురిజల బుచ్చిరెడ్డి**



**గొల్లపల్లి డిసెంబర్ 30 ప్రజా మంటలు :** గొల్లపల్లి మండల కేంద్రంలో దెబ్బతిన్న తారు రోడ్ల మరమ్మతులు వెంటనే చేపట్టాలని, ప్రజా రవాణా సౌకర్యానికి ఎట్టి పరిస్థితుల్లో ఆటంకం కలగకూడదని జగిత్యాల - ధర్మారం రోడ్డు ప్రభుత్వ హాస్పిటల్ వద్ద అంబేద్కర్ విగ్రహం కూడలి వెనుకమట్ల రోడ్డు నల్లగుట్ట దెబ్బతిన్న రోడ్లను వెంటనే మరమ్మతులు చెయ్యాలని ఆర్ అండ్బి ఏఇ ఆదిత్య కోరగా వెంటనే సందర్శించారు వారు స్పందిస్తూ వీలైనంత త్వరగా మరమ్మత్తులు చేపిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ నల్ల నీరజ సతీష్ రెడ్డి, ఉప సర్పంచ్ గురిజల బుచ్చిరెడ్డి, పంచాయతీ సెక్రెటరీ రాజి రెడ్డి, పాలకవర్గం పాల్గొన్నారు.

## వైకుంఠ ఏకాదశి వేళ...భక్తుల రద్దీతో పోటెత్తిన ఆలయాలు





**సికింద్రాబాద్, డిసెంబర్ 30 ( ప్రజామంటలు) :** సికింద్రాబాద్ శ్రీనివాస నగర్ శ్రీగిరి ప్రసన్న వేంకటేశ్వర ఆలయంలో మంగళవారం వైకుంఠ ఏకాదశి వేడుకలు ఘనంగా జరిగాయి. వేకువ జాము నుంచే వేలాది మంది భక్తులు ఆలయాన్ని సందర్శించి ఉత్తర ద్వారం గుండా శ్రీ వేంకటేశ్వర స్వామి వారిని దర్శించుకున్నారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఆలయ నిర్వాహకులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. భక్తులకు ఇబ్బంది కలగకుండా చక్కటి క్యూలైన్లు, తదితర ఏర్పాట్లను చేసిన ఆలయ నిర్వాహకులను పలువురు అభినందించారు. ఈసందర్భంగా ప్రతి ఏడాది మాదిరిగానే ఈసారి కూడ భక్తులకు స్వామి వారి చిత్రాలతో ప్రత్యేకంగా రూపొందించిన క్యాలెండర్లను ఉచితంగా పంపిణీ చేశారు. ఆలయ ఛైర్మన్ బసవరాజు శ్రీనివాస్, దేవస్థాన ఈవో కొడకండ్ల రాజేష్ కుమార్, ఆలయ ట్రస్ట్ మెంబర్ నారాయణన్, ఆలయ ముఖ్య అర్చక శ్రీనివాసచార్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

# ఇనుప రాతి గుట్టలను ప్రభుత్వం పరిరక్షించాలి

**అటవీ ప్రాంతాన్ని పట్టాల పేరుతో బహుళ జాతి కంపెనీలు కబ్జా**

**ధర్మ సమాజ్ పార్టీ జిల్లా నాయకులు బొంకూరి రాజు**

**ఎల్కతుర్తి డిసెంబర్ 30 ప్రజా మంటలు :** ఎల్కతుర్తి మండలం దామెర శివారు అనుకొని చుట్టూ నాలుగు మండలాలకు విస్తరిస్తూ సుమారు నాలుగువేల ఎకరాలకు పైగా ఉన్న ఇనుపరాతి గుట్టలుగా పేరుగాంచిన అటవీ ప్రాంతాన్ని పట్టాల పేరుతో బహుళ జాతి కంపెనీలు కబ్జా చేస్తున్నాయని ధర్మసమాజ్ పార్టీ జిల్లా నాయకులు బొంకూరి రాజు ఒక ప్రకటన ద్వారా తీవ్రంగా విమర్శించారు. ఇటీవలే బహుళ జాతి సంస్థలకు సంబంధించిన కొందరు వ్యక్తులు ఇరపరాతి గుట్టలోని కొంత భూమిని చదును చేస్తూ అటవీ సంపదను విలువైన చెట్లను నరికి వేస్తూ రోడ్డు వేస్తున్నారు దీనిపై అటవీ శాఖ అధికారులు తక్షణమే స్పందించి తగిన చర్యలు తీసుకోవాలన్నారు. గతంలో ఇనుపరాతి గుట్టల్లో మైనింగ్ కోసం బహుళ జాతి సంస్థలు ప్రయత్నించగా స్థానిక ప్రజా తిరుగుబాటుతో ఆ ప్రక్రియ నిలిచిపోయింది. ఈ ఫారెస్ట్ ఏరియాలోనే ఏకో టూరిజం పార్కు ఏర్పాటుకు ప్రయత్నాలు జరుగుతున్న తరుణంలో పట్టాల పేరుతో బహుళ జాతి సంస్థలు అటవీ ప్రాంతాన్ని సంపదను ధ్వంసం చేయడం అనేక అనుమానాలకు తావితీస్తుందన్నారు. ఇనపరాతి గుట్టల్లో ఎన్నో విలువైన మొక్కలు మెడిసిన్ ప్లాంట్స్ ఉన్నాయి 100 పైగా పక్షి జాతులు అనేక జీవజాతులు ఈ అటవీ ప్రాంతంలో మనుగడ కొనసాగిస్తున్నాయి. పట్టాల పేరుతో బహుళ జాతీయ కంపెనీలు ఇష్టానుసారంగా చెట్లను తొలగించడం వల్ల అటవీ ఏరియా తగ్గి జీవజాతులకు ముప్పు ఏర్పడుతుంది అని అన్నారు. ప్రభుత్వం అటవీశాఖ తక్షణమే స్పందించి ఇనుపరాతి గుట్టలోని అటవీ ప్రాంతంతో పాటుగా అందులోనే జీవజాతులను పరిరక్షించుకోవడం కోసం తగిన చర్యలు తీసుకోవాలని ధర్మ సమాజ్ పార్టీ జిల్లా నాయకులు బొంకూరి రాజు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.



# అర్ధరాత్రి 12.30 వరకే అనుమతి

**నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు**

**న్యూ ఇయర్ వేడుకలపై వరంగల్ సీపీ సన్ ప్రీత్ సింగ్ మార్గదర్శకాలు**

**డ్రంక్ అండ్ డ్రైవ్, ర్యాష్ డ్రైవింగ్‌పై ప్రత్యేక నిఘా**

**షీ టీమ్స్, టాస్క్‌ఫోర్స్‌తో విస్తృత బందోబస్తు**

**భీమదేవరపల్లి, డిసెంబర్ 30 (ప్రజా మంటలు) :** నూతన సంవత్సర వేడుకలను ప్రజలు ఆనందోత్సాహాల మధ్య, ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్ పిలుపునిచ్చారు. డిసెంబర్ 31 రాత్రి జరిగే వేడుకల దృష్ట్యా, ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా కమిషనరేట్ పరిధిలో కట్టుదిట్టమైన భద్రతా చర్యలు చేపట్టినట్లు ఆయన సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ?నూతన సంవత్సర వేడుకల సందర్భంగా ప్రజలు, ముఖ్యంగా యువత పాటించాల్సిన నిబంధనలను సీపీ వివరించారు. నిబంధనలు అతిక్రమించే వారిపై చట్ట పరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు.

**ముఖ్యమైన మార్గదర్శకాలు**

**సమయ పాలన :** నూతన సంవత్సర వేడుకలను అర్ధరాత్రి 12.30 గంటల లోపు తప్పనిసరిగా ముగించాలి.

**ముందస్తు అనుమతి :** సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేసే నిర్వాహకులు పోలీసుల నుండి ముందస్తు అనుమతి తీసుకోవాలి. వేడుకల్లో అశ్లీల నృత్యాలకు ఎట్టి పరిస్థితుల్లోనూ అనుమతి లేదు.

**భద్రతా ఏర్పాట్లు :** ఈవెంట్స్ నిర్వహించే ప్రదేశాల్లో సీసీ కెమెరాలు, ప్రైవేట్ సెక్యూరిటీ సిబ్బందిని తప్పనిసరిగా ఏర్పాటు చేసుకోవాలి.

**నిఘా నేత్రం :** శాంతిభద్రతల పరిరక్షణ కోసం స్థానిక పోలీసులతో పాటు ట్రాఫిక్, టాస్క్‌ఫోర్స్, క్రైమ్, షీ టీమ్స్ మరియు పెట్రోలింగ్ విభాగాలు ముమ్మరంగా గస్తీ నిర్వహిస్తాయి.

**ట్రాఫిక్ ఆంక్షలు :** వేడుకల కారణంగా సామాన్య ప్రజలకు, ఇతరులకు ట్రాఫిక్ పరంగా ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలి. బహిరంగ ప్రదేశాల్లో న్యూసెన్స్ చేస్తే ఉపేక్షించేది లేదు.

**డ్రంక్ అండ్ డ్రైవ్‌పై ఉక్కుపాదం :** వేడుకల పేరుతో యువత మద్యం సేవించి వాహనాలు నడిపితే కఠిన చర్యలు తీసుకుంటామని సీపీ హెచ్చరించారు. ట్రైసిటీతో పాటు గ్రామీణ ప్రాంతాల్లోనూ విస్తృతంగా డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు నిర్వహిస్తామన్నారు. మద్యం తాగి పట్టుబడితే భారీ జరిమానాతో పాటు జైలు శిక్ష విధిస్తామని స్పష్టం చేశారు. అలాగే రోడ్లపై మితిమీరిన వేగంతో వాహనాలు నడపడం, పాదచారులను భయభ్రాంతులకు గురిచేయడం వంటి చర్యలకు పాల్పడితే చట్టపరమైన చర్యలు తప్పవన్నారు.

**మాదక ద్రవ్యాలపై నిఘా :** వేడుకల్లో మాదక ద్రవ్యాల వినియోగంపై ప్రత్యేక నిఘా ఉంచామని, ఎవరైనా డ్రగ్స్ వాడితే కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఎక్కడైనా నిబంధనల ఉల్లంఘన లేదా అల్లర్లు జరుగుతున్నట్లు ప్రజల దృష్టికి వస్తే వెంటనే డయల్ 100 కు సమాచారం అందించాలని కోరారు. ప్రజలు, యువత తమ కుటుంబ సభ్యులతో కలిసి ఇళ్లలోనే ఆనందంగా వేడుకలు జరుపుకోవాలని సీపీ సూచించారు.

# గొప్ప దాతృత్వం కలిగిన వ్యక్తి కాసుగంటి సుధాకర్ రావుబి జగిత్యాల ఎమ్మెల్యే డా సంజయ్ కుమార్



**జగిత్యాల డిసెంబర్ 30 (ప్రజా మంటలు) :** గొప్ప దాతృత్వం కలిగిన వ్యక్తి కాసుగంటి సుధాకర్ రావు అని జగిత్యాల శాసనసభ్యులు డాక్టర్ సంజయ్ కుమార్ అన్నారు. జగిత్యాల పట్టణ పద్మనాయక కళ్యాణ మంటపం లో పద్మనాయక వెలమ సంక్షేమ మండలి జగిత్యాల వారి ఆధ్వర్యం లో కాసుగంటి సుధాకర్ రావు సంతాప కార్యక్రమంలో ఎమ్మెల్యే డా సంజయ్ కుమార్ పాల్గొని మాట్లాడారు. ప్రముఖ విద్యావేత్త , శ్రీ సరస్వతీ శిశు మందిర్ శిశు మందిర్, శ్రీ వాణి జూనియర్ కళాశాల ,గోదావరి వ్యాలీ వ్యవస్థాపకులు కాసుగంటి సుధాకర్ రావు అనారోగ్యం తో హైదరాబాదులో మరణించగా వారి చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సంజయ్ కుమార్ మాట్లాడుతూ సుధాకర్ రావు ప్రముఖ విద్యావేత్తగా కాకుండా సామాజిక సేవ తత్పరుడు పారిశ్రామికవేత్త గా తన సేవలు అందించారని గుర్తు చేశారు వేలాది మంది విద్యార్థులను తీర్చిదిద్దిన ఘనత ఆయనకు దక్కుతుందని అంతేగాకుండా ఎందరో నిరుద్యోగ యువతకు ఉపాధి మార్గాలు చూపించిన దార్శనీకుడు సుధాకర్ రావు అన్నారు గొప్ప దాతృత్వం కలిగిన వ్యక్తిగా ఆయన సేవలు అగణితము అన్నారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షులు ఆయిల్నేని సాగర్ రావు,మాజీ అధ్యక్షులు పురుషోత్తం రావు,ముప్పాళ్ళ రామచందర్ రావు ప్రధాన కార్యదర్శి వేణు గోపాల్ రావు,కార్యవర్గ సభ్యులు,సంఘం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## రవీంద్రభారతిలో ముదిరాజ్ ప్రజాప్రతినిధులకు ఘన సన్మానం

**సికింద్రాబాద్, డిసెంబర్ 30 ( ప్రజామంటలు) :** తెలంగాణ రాష్ట్రంలో సర్పంచులు, వార్డు సభ్యులుగా ఇటీవల ఎన్నికైన ముదిరాజ్ ప్రజాప్రతినిధులను సోమవారం రవీంద్రభారతిలో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర మంత్రి వాకిటి శ్రీహరి ముదిరాజ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. మల్కాజ్‌గిరి ఎంపీ ఈటల రాజేందర్ ముదిరాజ్, ఎమ్మెల్సీ బండ ప్రకాష్ ముదిరాజ్ పాల్గొని మాట్లాడారు. బుర్ర జ్ఞానేశ్వర్ ముదిరాజ్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో జాతీయ ప్రధాన కార్యదర్శి కాసాని వీరేష్ ముదిరాజ్, పి. వెంకటేశ్వర్ ముదిరాజ్ (గుజరాత్), జాతీయ ఎగ్జిక్యూటివ్ సభ్యుడు యు. నారాయణ ముదిరాజ్, టి. గంగాధర్ ముదిరాజ్, సీతాఫల్మండి కార్పొరేటర్ డాక్టర్ సామల హేమ, నీలం శ్రీనివాస్ ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు. కార్యక్రమాన్ని విజయవంతం చేసిన వారికి నిర్వాహకులు కృతజ్ఞతలు తెలిపారు.



ప్రజా మంటలు

బుధవారం 31 - 12 - 2025

# మన వద్ద స్కూళ్లలో న్యూస్‌పేపర్ చదవడం తప్పనిసరి చేయాలి

**విద్యావేత్తల డిమాండ్**

**దినపత్రికల పఠనాన్ని ఇటీవల తప్పనిసరి చేసిన ఉత్తర్‌ప్రదేశ్ ప్రభుత్వం**

**తెలంగాణలోని సర్కారు బడుల్లో అమలు చేయాలని డిమాండ్**



పిల్లల్లో మరింత విజ్ఞానం పెరుగుతుందంటున్న నిపుణులు

అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో దినపత్రికల పఠనాన్ని తప్పనిసరి చేస్తూ ఇటీవల ఉత్తర్‌ప్రదేశ్ ప్రభుత్వం తాజాగా ఉత్తర్వులిచ్చింది. ఉదయం కనీసం పది నిమిషాల పాటు పిల్లలంతా వార్తా పత్రికలను చదివేలా చూడాలని ఆదేశించింది. ఈ విధానం తెలంగాణలోని ప్రభుత్వ బడుల్లో అమలు చేస్తే విద్యార్థులకు ఎంతో ప్రయోజనం కలుగుతుందని ఉపాధ్యాయులు తమ అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.ప్రస్తుత విద్యా విధానంలో పాఠ్య పుస్తకాల అంశాలపై తప్ప బయటి ప్రపంచ సంబంధాల వంటి అంశాలపై పిల్లలు వెనుకబడుతున్నారు. నూతన జాతీయ విద్యా విధానం-2020లో భాగంగా కేంద్ర ప్రభుత్వం 'పీఎంశ్రీ'(ప్రధానమంత్రి స్కూల్స్ ఫర్ రైజింగ్ ఫర్ ఇండియా) పాఠశాలల్లో వార్తా పత్రికల పఠనాన్ని తప్పనిసరి చేసింది. నిజామాబాద్ జిల్లాలో ఈ విద్యా సంవత్సరం నుంచి సుమారు 40 స్కూళ్లలో కనీసం రెండు దినపత్రికలు అందుబాటులో ఉంచుతున్నారు.మిగతా 1,126 ప్రభుత్వ పాఠశాలల్లో ఎక్కడో ఒకచోట హెడ్ మాస్టర్‌లు, ఉపాధ్యాయులు సొంతంగా న్యూస్ పేపర్లు కొనుగోలు చేస్తున్నారు. వాటిని పిల్లలతో లైబ్రరీల్లో చదివిస్తున్నారు. పలు ప్రైవేటు విద్యాసంస్థలలో కూడా ఈ ప్రయత్నం జరుగుతోంది. వార్తలను చదవడంపై తప్పనిసరి చేస్తే ప్రయోజనం ఉంటుందనేది తల్లిదండ్రులు, విద్యారంగ నిపుణుల గట్టి అభిప్రాయం.పదో తరగతి విద్యార్థులు వార్షిక పరీక్షల్లో మాతృభాష తెలుగులో కూడా తప్పుతుండటం తీవ్ర ఆందోళనకు దారి తీస్తుంది. 3 నుంచి 5 చదివే వారిలో 16.1 శాతం, 6 నుంచి 8 తరగతుల్లో 44.6 శాతం మందికి మాత్రమే కాస్త పట్టు ఉందని పలు సర్వేల్లో తేలింది. మాతృభాషపై పట్టున్నవారే చదువులో బాగా రాణిస్తారని విద్యా నిపుణులు చెబుతున్నారు. చదవడం, రాయడం అనే నైపుణ్యాలు పత్రికా పఠనంతో అలవడుతాయని రీడింగ్ కార్నర్, లైబ్రరీలను మంచి వేదికలుగా మార్చాలని సూచిస్తున్నారు.

**న్యూస్ పేపర్లతో నాలుగు విధాలా లాభం**

**నైపుణ్యాలు :** తెలుగు పదజాలంపై పట్టు సాధించడం వల్ల వేగంగా చదవడం, రాయడంతో పాటు మాట్లాడే నైపుణ్యాలు మెండుగా పెరుగుతాయి.

**విజ్ఞానం :** చుట్టూ జరిగే సంఘటనలతో పాటు జనరల్ నాలెడ్జ్, అంతర్జాతీయ, శాస్త్ర సాంకేతిక రంగాలు, క్రీడా విజ్ఞానం వంటివి పెంపొందుతుంది. ఫజిల్స్ మెదడుకు మంచి పదును పెడతాయి.

**సమయపాలన :** వ్యక్తిత్వ వికాసానికి తోడు పిల్లల్లో సరైన సమయ పాలన అలవడుతుంది.

**విశ్లేషణ శక్తి :** మానవ హక్కులపై పాఠశాల స్థాయిలోనే అవగాహన కలుగుతుంది. ప్రజా సమస్యలు గుర్తించి, వాటికి పరిష్కారం చూపేలా విశ్లేషణాత్మకంగా సరికొత్త ఆలోచన సాగిస్తారు. ఉత్తమ విద్యావంతులుగా మెరుగైన సమాజ నిర్మాణంలో పిల్లలు భాగస్వాములవుతారు.

ప్రతిరోజూ ఉదయం విద్యార్థుల్ని సమావేశపరిచే సమయంలో కనీసం పది నిమిషాల సమయాన్ని వార్తాపత్రికల పఠనానికి కేటాయించాలని యూపీ సర్కారు స్పష్టంచేసింది. ఈ సమయంలో వంతులవారీగా విద్యార్థులు వార్తాపత్రికల్లోని ప్రధాన వార్తలను, సంపాదకీయాల్లో ముఖ్యాంశాలను, జాతీయ, అంతర్జాతీయ, క్రీడా వార్తలను చదివి బయటకు వినిపిస్తారు. నేటి పదం రూపంలో వార్తాపత్రికల నుంచి ఐదు క్లిష్టమైన పదాలను గుర్తించి, నోటీసు బోర్డుపై రాయాల్సి ఉంటుంది. దీనివల్ల విద్యార్థులల్లో వారి పదజాలం మెరుగవుతుంది. వార్తాపత్రికలను చదవడం వల్ల విజ్ఞానం పెరిగి, కొత్త కొత్త పదాలు తెలియడంతో పాటు సామాజిక అవగాహన, ఆలోచనాతీరు మెరుగుపడి ప్రభుత్వం నిర్వహించే పోటీ పరీక్షలకు బాగా సిద్ధపడటానికి వీలుంటుందని, తప్పుడు వార్తలపై మరింత చైతన్యం పెరుగుతుందని యోగి సర్కారు భావిస్తోంది. ఫోన్లు, సోషల్ మీడియాకు సాధ్యమైనంత దూరంగా ఉంటూ పుస్తకాలు చదివేలా ఈ విధానం విద్యార్థులను ప్రోత్సహిస్తుంది.

# సంక్రాంతికి కోనసీమలో గదుల కొరత

**అతిథి గృహాల్లోనూ ఇదే పరిస్థితి!**

**గతేడాదితో పోల్చితే ఇప్పుడు ముందుగానే హెూటళ్లలో గదులు అన్నీ బుక్**

**దిండిలో పర్యాటకశాఖ అతిథి గృహాల్లో 30 వరకు గదులుండగా**

**జనవరి 11 నుంచి 20 వరకు ఖాళీలు లేవు**



సంక్రాంతి అంటే అందరికి గుర్తుకు వచ్చేది కోనసీమ. సొంతూళ్లు వచ్చేందుకు రెండు నెలలు ముందుగానే బస్సు, రైళ్లు టిక్కెట్లు బుక్? చేసుకుంటారు. స్థానికుల బంధువులు, స్నేహితులతో పాటు ఇతరులు కూడా ఈ ప్రాంతానికి వస్తుంటారు. ఈ నేపథ్యంలో వారికి వసతి సమస్య నెలకొంది. గత ఏడాదితో పోల్చితే ఇప్పుడు ముందుగానే హెూటళ్లలో గదులు బుక్ చేసుకున్నారు. రాజోలు, అమలాపురం, ముమ్మిడివరంలో జరిగే సంక్రాంతి సంబరాలు, కోడిపందేలు చూసేందుకు ఈ ఏడాది భారీ సంఖ్యలో జనం వచ్చే అవకాశాలు ఉన్నాయి.హైదరాబాద్‌కు చెందిన 10 మంది యువకులు సంక్రాంతి సంబరాలు చూద్దామని కోనసీమకు వచ్చేందుకు నిర్ణయించుకున్నారు. హెూటల్‌లో గదులు తీసుకుందామనుకుంటే జనవరిలో చాలా వరకు నిండిపోయాయి. దీంతో కోనసీమలో అతిథి గృహాలను వెతికే పనిలో పడ్డారు. సంక్రాంతి పండుగ రోజుల కంటే ముందుగానే అవీ నిండిపోయాయని తెలుసుకున్నారు.రాజోలు సమీపంలోని దిండిలో పర్యాటకశాఖ అతిథి గృహాల్లో 30 వరకు గదులు ఉన్నాయి. వాటిలోనూ జనవరి 11 నుంచి 20 వరకు ఖాళీలు లేవు. జాతీయ రహదారిని ఆనుకుని ఉన్న అతిథి గృహాల్లోనూ ఇదే పరిస్థితి ఉంది.అతిథుల అన్వేషణ: మండువా లోగిళ్లకు ప్రసిద్ధి గోదావరి జిల్లాలే. వీటికి వందేళ్లకు పైగా చరిత్ర ఉంది. మామిడికుదురు మండలం పెదపట్నంలంకలోని మన మండువా ఇల్లు పర్యాటకులను ఎంతోగానో ఆకట్టుకుంటుంది. ఇక్కడ ఒకరోజు ఉండేందుకు రూ.30 వేలకు పైగానే తీసుకుంటున్నారు. పాతకాలం నాటి జ్ఞాపకాలు, అలనాటి మధుర స్మృతులను నేటి తరానికి పరిచయం చేస్తున్నాయి. నిజానికి ఆనాటి వస్తువులన్నీ ఈ మండువా లోగిళ్లలో ఉంచడంతో అతిథులను ఆకర్షిస్తున్నాయి. వీటిలో 6 నుంచి 8 వరకు గదులు ఉన్నాయి.ఇదే గ్రామంలోని ఓ ప్రైవేటు రిసార్టు ఉంది. అక్కడ గదుల చక్కగా ఉండటంతో వాటిని వినియోగించేందుకు అతిథులు ఆసక్తి చూపుతున్నారు. అదే విధంగా రాజోలు సమీపంలోని దిండి రిసార్టు ఉంది. అమలాపురం పట్టణంలోని కోనసీమ విడిదిల్లు పేరుతో ఓ గృహాన్ని ఇటీవలే సిద్ధం చేశారు. 7 గదులు ఉండే దీనికి రోజుకు రూ.15 వేలు వరకు తీసుకుంటున్నారు. దీన్ని ఎంతో అందంగా తీర్చిదిద్దారు.మండువా లోగిళ్లు విడిదిల్లు: ఈసారి సంక్రాంతి పండుగను ఆహ్లాదంగా జరుపుకోవాలని అతిథులు ఆసక్తి చూపుతున్నారు. ప్రధానంగా కొబ్బరి తోటల్లో చూడముచ్చటగా ఉండే ఇళ్ల కోసం, ప్రత్యేకించి మండువా లోగిళ్లు కోసం అతిథులు ఎంతోగానో అన్వేషిస్తున్నారు. గదుల ధరలు అధికంగా ఉన్నప్పటికీ వెనకడుగు వేయడం లేదు. ముందుగానే బుక్ చేసుకునేందుకు ఆసక్తి చూపిస్తున్నారు. అలాంటి వాటి కోసమే పరితపిస్తున్నారు.సంక్రాంతి అనగానే గోదావరి జిల్లాల్లో పచ్చదనం, ముగ్గులు, గొబ్బెమ్మలు, బసవన్నలు, పిండివంటలు ఇలా ఎన్ని ఉన్నా కోడి పందేలది మాత్రం ప్రత్యేక స్థానం ఉంది. వారూ వీరూ అనే తేడా లేకుండా అందరి చూపూ వాటి పైనే ఉంటుంది. ఈ క్రమంలో సంక్రాంతి బరిలో కాలు దువ్వేందుకు పందెం కోళ్లు సై అంటున్నాయి. బరిలే నిలిచేందుకు గాను కొన్ని నెలలు ముందుగానే వాటికి ప్రత్యేక శిక్షణను అందిస్తారు. రాటుదేలిన కోళ్లు తమ సత్తాను చాటేందుకు ఉవ్విళ్లూరుతున్నాయి.సంక్రాంతి పండగ వచ్చిందంటే చాలు గోదావరి జిల్లాల్లో ఎక్కువగా కోడి పందేలపై చర్చలు సాగుతుంటాయి. పండగ దగ్గర పడుతున్న తరుణంలో గ్రామాల్లో సందడి మొదలైంది. పందేల్లో పుంజులను బరిలో దించేందుకు ఏర్పాట్లు చేసుకుంటున్నారు. కొందరు పిల్ల దశ నుంచి కోళ్లను ప్రత్యేకంగా పెంచుతుంటారు. మరికొందరు మాత్రం ధర ఎంతైనా వెనుకాడకుండా కొనుగోలు చేస్తున్నారు. ప్రస్తుతం శిబిరాల్లోని కోడి పుంజుల క్రయ విక్రయాలు జోరుగా సాగుతున్నాయి.

# అనంతపురం-గుంటూరు హదారి 544-డి విస్తరణకు మరో ముందడుగు

**భూసేకరణకు నోటిఫికేషన్**

**వినుకొండ నుంచి గుంటూరు వరకు ఇప్పుడున్న రెండు వరుసల రహదారిని నాలుగుగా మార్చేందుకు అవసరమైన భూసేకరణకు నోటిఫికేషన్ జారీ**

**గ్రీన్ ఫీల్డ్‌లో హద్దుల ఏర్పాటుకు షెడ్యూల్ ప్రకటన**



అనంతపురం టు గుంటూరు జాతీయ రహదారి 544-డి (%చీఎ-544ణ%) విస్తరణకు ముందడుగు పడింది. వినుకొండ నుంచి గుంటూరు వరకు ఇప్పుడున్న రెండు వరుసల రహదారిని నాలుగుగా మార్చేందుకు అవసరమైన భూసేకరణకు నోటిఫికేషన్ జారీ అయినట్లు సంబంధిత అధికారులు తెలుపుతున్నారు. దీనిలో భాగంగా జిల్లాలోని గ్రీన్ ఫీల్డ్‌లో హద్దుల ఏర్పాటుకు (పెగ్‌మార్క్ కోసం) నేషనల్ హైవేస్ అథారిటీ ఆఫ్ ఇండియా షెడ్యూల్ ప్రకటించి అధికార బృందాలను ఏర్పాటు చేసింది. దీన్ని జనవరి 9 నాటికి పూర్తి చేయాలని నిర్దేశించింది. సర్వే పూర్తి చేసేందుకు స్థానిక రెవెన్యూ అధికారుల సహకారం కోరుతూ జిల్లా సంయుక్త కలెక్టర్‌కు ఎన్‌హెచ్ ప్రాజెక్టు డైరెక్టర్ పార్వతీశం లేఖ రాశారు.విస్తరణ 85 కిలోమీటర్లు : వినుకొండ నుంచి గుంటూరు వరకు 85 కి.మీ. రోడ్డును నాలుగు వరుసలుగా విస్తరించనున్నట్లు అధికారులు తెలుపుతున్నారు. దీనికి సంబంధించి ఈ ఏడాది మార్చిలో జాతీయ రహదారుల విభాగం 3ఏ నోటిఫికేషన్ విడుదల చేసింది. ఆ తర్వాత డీపీఆర్ పూర్తి కావడంతో రహదారి నిర్మించేందుకు హద్దులను గుర్తించి స్తంభాలు పాతాలని నిర్ణయించారు. గుంటూరు, బాపట్ల, పల్నాడు జిల్లాలకు వేర్వేరుగా షెడ్యూల్ విడుదల చేశారు. పర్యవేక్షణ కోసం ప్రత్యేకంగా ముగ్గురు అధికారులను నియమించారు.నష్టపరిహారం చెల్లించేందుకు సేకరించిన భూముల వివరాల సేకరణ : పల్నాడు జిల్లాలో జనవరి 9వ తేదీ వరకు, బాపట్ల జిల్లా సంతమాగులూరు మండలంలో 10 నుంచి 12 వరకు రెండ్రోజుల్లో హద్దులు నిర్ణయించే ప్రక్రియ పూర్తి చేయాలని నిర్దేశించారు. ఈ ప్రక్రియ పూర్తయిన తర్వాత ఆయా మండలాల సర్వే, రెవెన్యూ అధికారులు నష్టపరిహారం చెల్లించేందుకు సేకరించిన భూముల విస్తీర్ణం, వాటి విలువలు లెక్కిస్తారు. తదుపరి ఈ ప్రక్రియ నిర్వహిస్తారని అధికారులు తెలిపారు.

**ఎన్‌హెచ్-544డీకి త్వరలోనే భూసేకరణ - ఇక నంద్యాల టూ అమరావతికి రూట్ క్లియర్**

ఈ హైవే పనులు పూర్తైతే నంద్యాల జిల్లా వాసులు రాజధాని అమరావతి వెళ్లడానికి మార్గం సుగమవుతుందని నిపుణులు తెలుపుతున్నారు. అనంతపురం-గుంటూరు జాతీయ రహదారి-544డీని నాలుగు లైన్లుగా విస్తరిస్తున్నారు. అనంతపురం జిల్లా బుగ్గ నుంచి ప్రకాశం జిల్లా గిద్దలూరు వరకు 135 కిలోమీటర్ల పొడవునా ఒక ప్యాకేజీ, వినుకొండ-గుంటూరు మధ్య 84.80 కిలోమీటర్ల మేర మరో ప్యాకేజీగా విస్తరించనున్నారు. ప్యాకేజీ-1 కింద జిల్లాలో 100 కిలోమీటర్ల మేర రహదారిని నాలుగు వరుసలుగా తీర్చిదిద్దనున్నారు. ఈ రోడ్డుకి కేంద్ర ప్రభుత్వం రూ.4200 కోట్లు ఖర్చు చేయనున్నట్లు సంబంధిత అధికారులు తెలుపుతున్నారు.బైపాస్‌లు ఎక్కడెక్కడ అంటే : రాఘవరాజుపల్లి-కనకాద్రిపల్లి, కొలిమిగుండ్ల మండలం అంకిరెడ్డిపల్లె, కొలిమిగుండ్ల, అవుకు మండలం రామాపురం-అవుకు, బనగానపల్లి మండలంలోని బనగానపల్లి, టంగుటూరు, కైప, అప్పలాపురం, గోస్పాడు మండలంలోని రాయపాడు-తేళ్లపురి, దీబగుంట్ల, పసురపాడు, ఎస్.నాగులవరం, మహానంది మండలం గాజులపల్లెలో బైపాస్ రోడ్లను నిర్మించనున్నట్లు సంబంధిత అధికారులు తెలుపుతున్నారు.

**సులువుగా చేరుకునేలా దారులివే**

బుగ్గ-గుంటూరు రహదారి నాలుగు లైన్లుగా విస్తరించేందుకు కేంద్ర ప్రభుత్వం రూ.4200 కోట్లు ఖర్చు చేయనుంది. ఫలితంగా రాయలసీమ వాసులు రాజధానికి వెళ్లే మార్గం సుగమం కానుంది. ఈ రోడ్డు నిర్మాణంతో హిందూపురం, అనంతపురం, నంద్యాల, కర్నూలు జిల్లా వాసులతోపాటు వైఎస్సార్ కడప జిల్లా వాసులు సులువుగా రాజధాని అమరావతికి చేరుకోవచ్చు.అనంతపురం-గుంటూరు నాలుగు లైన్ల రహదారిని నాలుగు ప్యాకేజీలుగా విభజించారు. మొదటి ప్యాకేజీలో భాగంగా ఇప్పటికే అనంతపురం నుంచి బుగ్గ వరకు పనులు జరుగుతున్నాయి.బుగ్గ-గిద్దలూరు మధ్య రెండో ప్యాకేజీ పనులతోపాటు వినుకొండ-గుంటూరు మధ్య మరో ప్యాకేజీ పనులకు ప్రస్తుతం నిధులు మంజూరు చేశారు. బుగ్గ-గిద్దలూరు ప్యాకేజీకి సంబంధించి త్వరలో భూసేకరణ పనులు ప్రారంభించనున్నారు.

# 2026 రిజల్యూషన్


**'ఇకనైనా మానేద్దాం' అనుకుంటున్నారా**

**ఇలా ప్లాన్ చేసుకోండి**

**సరైన ప్రణాళికతో అనుకున్నవి సాధించవచ్చు**

**ఆరోగ్యం, నిద్ర, పొదుపు వంటి విషయాల్లో ఓ రిజల్యూషన్ తప్పనిసరి**

**నిపుణుల సూచనలు పాటిస్తే మంచి ఫలితాలు**



పాత సంవత్సరానికి గుడ్‌బాయ్ చెప్పి, కొత్త ఏడాదికి స్వాగతం చేప్పే ముందు చాలా మంది ఓ కొత్త సంకల్పం లేదా తీర్మానాలు (రిజల్యూషన్) తీసుకుంటారు. వాటిని అమలు చేయాలి అనుకున్నా, కొన్నిసార్లు అనుకోని అవాంతరాలు ఎదురవుతుంటాయి. అనుకున్న సంకల్పం నెరవేరేందుకు చక్కటి ప్రణాళికను సిద్ధం చేసుకుని, కొన్ని రోజుల పాటు క్రమం తప్పకుండా అనుకున్న పనిని చేస్తే మంచి ఫలితాలు సాధించవచ్చని నిపుణులు సూచిస్తున్నారు. ఇలాంటి వారి కోసం కొత్త ఏడాదిలో సంకల్పాల విజయవంతానికి ఏటా డిసెంబరు 30న 'తీర్మానాల ప్రణాళిక దినోత్సవం' నిర్వహిస్తున్నారు.పొదుపు తప్పనిసరి : కొంతమంది ఎంత సంపాదించినా నెలాఖరుకు వచ్చే సరికి వేరొకరి వద్ద చేయి చాపాల్సి వస్తోంది. సరైన ప్రణాళిక ఉంటే తక్కువ వేతనంతోనైనా సర్దుకుపోవచ్చని ఆర్థిక నిపుణులు సూచిస్తున్నారు. వచ్చిన సంపాదనలో కొంత తప్పనిసరిగా పొదుపు చేయడంతో పాటు అవసరం ఉన్న వస్తువులు మాత్రమే కొనుగోలు చేయడం, వ్యక్తిగత వాహనాల వినియోగాన్ని తగ్గించడం వంటి చర్యలతో పాటు ఆరోగ్య బీమా వంటివి తీసుకుని ఉండాలి.పోషకాహారం, నిద్ర ముఖ్యం : మనం ఎంత సంపాదించినా, ఆరోగ్యం సహకరించకపోతే అన్నీ వృథానే. అందుకే ఎలాంటి వృత్తిలో ఉన్నా వేళకు సరైన పోషకాహారం, కంటి నిండా నిద్ర ఉంటే ఎలాంటి అనారోగ్యాలు దరిచేరవు. ఉమ్మడి నల్గొండ జిల్లాలో అనేక మంది చిన్న వయసులోనే వివిధ అనారోగ్యాల బారిన పడుతున్నారు. ప్రణాళికతో చదువులు : కొత్త ఏడాదిలో తొలి మూడు నెలలు విద్యార్థులవే. పదో తరగతి, ఇంటర్ వంటి పలు తరగతుల విద్యార్థులకు జనవరి నుంచి మార్చి వరకు ఎంతో ముఖ్యమైనవి. మార్చిలో పరీక్షలు ప్రారంభం కానున్నందున సరైన ప్రణాళికతో పుస్తకాలతో కుస్తీ పట్టాలి.పుస్తకాలతో పాటు మరిన్ని కొత్త విషయాలు : తరగతితో సంబంధం లేకుండా ప్రతి ఒక్క విద్యార్థి పుస్తకంలోని అంశాలతో పాటు సరికొత్త నైపుణ్యాలు నేర్చుకునేందుకు సమయం కేటాయించాలి. చరవాణికి కేటాయించే సమయాన్ని కొత్త నైపుణ్యాలు నేర్చుకునేందుకు కేటాయిస్తామని ఈ ఏడాది తీర్మానం చేసుకోవాలి.చెడు అలవాట్లకు దూరంగా : చాలా మంది చెడు వ్యసనాలకు బానిసలుగా మారి, వాటి నుంచి బయటపడాలని ఎంతో ప్రయత్నిస్తుంటారు. కానీ కొన్నిసార్లు అది వారి వల్ల కాదు. ఏదో ఒక బలహీన క్షణంలో మళ్లీ అటు వైపునకు తిరిగి వెళ్తారు. వీరు ప్రతి సంవత్సరం 'ఇకనైన మానేద్దాం' అనుకుంటారు. అలాంటి వారు తగిన టిప్స్ పాటిస్తూ ప్రయత్నిస్తే ఫలితం దక్కుతుంది.

ఉమ్మడి జిల్లా సర్వే వివరాలు ఇవీ (సుమారు లక్షల్లో)

మొత్తం కుటుంబాలు: 10.8

జనాభా: 38

పాఠశాల విద్యార్థులు: 3.5

సర్వే ప్రకారం : వంద మందితో నిర్వహించిన సర్వేలో కొత్త సంవత్సరానికి తీర్మానాలు తీసుకోవడం మంచిదేనని భావిస్తున్న వారు 74 శాతం ఉన్నారు. లేదు మంచిది కాదు అనుకునే వారు 8 శాతం ఉన్నారు. చెప్పలేం అనుకునే వారు 18 శాతం ఉన్నారు. రాబోయే కొత్త ఏడాదిలో ఏమైనా తీర్మానాలు తీసుకునే వారు 72 శాతం ఉన్నారు. తీసుకోని వారు 9 శాతం ఉన్నారు. ఇంకా నిర్ణయించుకోని వారు 19 శాతం ఉన్నారు.నూతన సంవత్సంలో ఆరోగ్యానికి సంబంధించిన తీర్మానాలు విజయవంతం అవుతాయని 54 శాతం మంది అన్నారు. విద్యకు సంబంధించిన తీర్మానాలు విజయవంతం అవుతాయని 32 శాతం అన్నారు. ఆర్థికానికి సంబంధించిన తీర్మానాలు విజయవంతం అవుతాయని 14 శాతం మంది చెప్పారు.

# 11 రోజులు - 16 లక్షల మంది సందర్శన

**విజయవంతంగా ముగిసిన హైదరాబాద్ బుక్ ఫెయిర్**

**ఇంతకు ముందు ఎన్నడూ లేనంత విశేష స్పందన**

**సందర్శించిన ప్రముఖులు, రచయితలుద**

**పుస్తకాలపై 10, 20 శాతం రాయితీతో విక్రయం**

**11 రోజులు, 265 స్టాళ్లతో ఏర్పాటు చేసిన బుక్ ఫెయిర్**



పాఠకులు, సందర్శకులు వందల సంఖ్యలో రాగా 11 రోజుల పాటు మినీ జాతరను తలపించిన 38వ హైదరాబాద్ బుక్ ఫెయిర్ (హెచ్‌బీఎఫ్) సోమవారం ముగిసింది. 16 లక్షల మందికిపైగా సందర్శించినట్లు హెచ్‌బీఎఫ్ అధ్యక్షుడు, కవి యాకూబ్ వెల్లడించారు. సెలవులు ఎక్కువగా రావడంతో చాలామంది కుటుంబ సమేతంగా తరలొచ్చారు. ఎల్లప్పుడూ ఫోన్‌తో బిజీగా ఉండే కుర్రకారు కూడా బుక్ ఫెయిర్‌లో సందడి చేశారు.ఇటీవల నగరంలో సాయంత్రం 5 గంటల నుంచే చలి పంజా విసురుతోంది. చలిని సైతం లెక్క చేయకుండా రాత్రి 9 గంటల వరకు స్టాళ్లన్నీ కలియతిరుగుతూ పాఠకులు పుస్తకాలను కొనుగోలు చేశారు. ఈ సందర్భంగా పలు పుస్తకావిష్కరణలు జరిగాయి. ఈ బుక్ ఫెయిర్‌ను కొందరు ప్రముఖులు కూడా సందర్శించారు.ఈ ప్రదర్శనలో కాల్పనిక సాహిత్యంపై పుస్తకాలు ఎక్కువగా అమ్ముడుపోయాయని ఓ బుక్‌స్టాల్ నిర్వాహకుడు నారాయణ ప్రసాద్ తెలిపారు. వీటితో పాటు బాల సాహిత్యం, యాక్టివిటీ పుస్తకాలు, ఆంగ్ల రచనలు, స్టేషనరీ ఎక్కువగా కొనుగోలు చేశారని వివరించారు. ఉద్యోగ ప్రకటనలు అంతగా లేకపోవడంతో పోటీపరీక్షలకు సంబంధించిన పుస్తకాలకు ఆదరణ తగ్గిందన్నారు."ఇటీవల పుస్తక పఠనంపై ఆసక్తి పెరిగిందనడానికి ఈ బుక్ ఫెయిర్ నిదర్శనం. ఎన్నడూ లేనంతగా విశేష స్పందన లభించింది. విద్యార్థులు ఎక్కువగా పాల్గొనడం ఆనందాన్ని ఇచ్చింది. అంచనాలకు మించి పాఠకులు వచ్చారు. యువ రచయితలతో పాటు పబ్లిషర్లు పెరిగారు. సందర్శకులకు ఇబ్బంది తలెత్తకుండా నిర్వాహక కమిటీ శ్రమించింది.ఈ ఫెయిర్‌లో చాలా వరకు స్టాళ్లలో పుస్తక రచయితలు కూడా అందుబాటులో ఉన్నారు. వాళ్లు రాసిన పుస్తకాలకు సంబంధించిన విశేషాలు, ఆటోగ్రాఫ్‌లు ఇస్తూ పుస్తక ప్రియులను ఆనందపరిచారు. చాలా మంది యువ రచయితలు ఎన్నో రోజుల కిందటే పుస్తక రచన పూర్తైనా, ప్రత్యేకంగా బుక్ ఫెయిర్‌లోనే ఆవిష్కరించడానికి సిద్ధం అయ్యారు. ఇందుకోసం ప్రత్యేకంగా స్లాట్లు బుక్ చేసుకుని వచ్చారు.ఈ హైదరాబాద్ బుక్‌ఫెయిర్‌లో అన్ని రకాల పుస్తకాలు అందుబాటులో ఉంచారు. ఫిక్షన్, ఆధ్యాత్మికం, రైతుల కోసం, నాన్-ఫిక్షన్, ప్రముఖుల జీవిత చరిత్రలు, మ్యాగజైన్లతో పాటు పోటీ పరీక్షలకు సన్నద్ధం అయ్యేవారికి సైతం తెలుగు అకాడమీ పుస్తకాలను అందుబాటులో ఉంచింది. చాలా పుస్తకాలకు 10 నుంచి 20 శాతం వరకు రాయితీ కూడా ఇచ్చారు. అందువల్ల ఎవరూ ధరలు గురించి కూడా ఆలోచించకుండా కావాల్సిన పుస్తకాలను కోన్నుకున్నారు. ఇక్కడ పోలీస్ శాఖ ఏర్పాటు చేసిన 'సురక్ష' స్టాల్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. పుస్తకాలు కొనడానికి వచ్చిన వారంతా ఈ స్టాల్‌లో నుంచుని ఫోటో దిగుతూ ఆనందించారు.ఈ ఫెయిర్‌కి ఎంట్రీ టికెట్ కేవలం రూ.10 ఉండడంతో చాలా మంది కుటుంబ సమేతంగా వచ్చి తమకు ఇష్టమైన పుస్తకాలను కొనుగోలు చేసుకున్నారు. ఇక్కడ పల్లల కోసం ప్రత్యేక స్టాల్స్ ఏర్పాటు చేశారు. అందులో నీతి కథలు, డ్రాయింగ్, సైన్స్, కామిక్, 3డీ పుస్తకాలతో పాటు స్టేషనరీ స్టాళ్లు కూడా ఉంచారు. అలాగే పుస్తకాల గురించి తమ అభిప్రాయాలను అందరితో పంచుకునేందుకు ప్రత్యేకంగా స్టేజీలు ఏర్పాటు చేశారు. అక్కడ కొందరు రచయితలు, పాఠకులు వారి ఆలోచనలను పంచుకున్నారు. డిసెంబర్ 19న మొదలయ్యిన ఈ బుక్ ఫేయిర్ 11 రోజుల పాటు 265 స్టాళ్లతో పాఠకులను ఆకట్టుకుంది.

PRINTED AND PUBLISHED BY V.NARSINGAM, ON BEHALF OF CH.V. PRABHAKAR RAO AND PRINTED AT SRI S HARADHA OFFSET PRINTERS. H.NO.9-14/8/3, BUGGARAM VILLAGE AND MANDAL, BUGGARAM GRAMAPANCHAYATH- 505454, JAGTIAL DISTRICT, TELANGANA STATE.. PUBLISHED AT 6-6-206,PADMA NAGAR, JAGTIAL - 505327, JAGTIAL DISTRICT, TELANGANA STATE. EDITOR : CH V. PRABHAKAR RAO, RNI . TELTEL/2021/81092 : PHONE : 9391533339 EMAIL: prajamantalu@gmail.com